ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 24 ఫిబ్రవరి 2024





ఘాట్ రోడ్డులో.. డేంజర్

- మార్జిన్లు కోతలతో ప్రమాదాలు
- కోటయ్య తిరునాళ్లకైనా మరమ్మతులు చేసేనా..

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 23: మార్జిన్లకు కోతలతో కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి దేవస్థానం ఘాట్ రోడ్డు అధ్వాన్నంగా మారింది. ఎదురెదురు వాహనాలు వచ్చిన సమయంలో రోడ్డు దిగేందుకు అవకాశంలేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డంతా బాగా ఉన్నా మార్జిన్లు కోతలతో ఘాట్ రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. డిసెంబరులో కురిసిన భారీ వర్షాలతో వరద నీరు పారుదలతో రోడ్డు మార్జిన్లు కోతకు గురయ్యాయి. రెండు అడుగుల వరకు మట్టి కొట్టుకుపోయింది. రాళ్లు బయట పడ్డాయి. మార్జిన్ దిగాలంటే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కొండపై నుంచి రాళ్లు కూడా కిందకు జారాయి. వీటిని తొలగించలేదు. తిరునాళ్ల సమీపిస్తున్నా మార్జిన్లకు మరమ్మతులు, రోడ్డుపై జారిన కొండరాళ్లను తొలగించలేదు. మార్జిన్లను పటిష్ట పరచాల్సి ఉంది. లేకుంటే తిరునాళ్ల రోజున ఇబ్బంకర పరిస్థితులు నెలకునే అవకాశం ఉంది. మరమ్మతులకు ఆర్‌అండ్‌బీ శాఖ తక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.


కోతకు గురైన ఘాట్ రోడ్డు మార్జిన్లు

అమరేశ్వరాలయంలో చోరీ

అమ్మవారి హుండీ పగలకొట్టిన దుండగుడు


గడ్డపలుగుతో ఆలయంలోకి ప్రవేశించిన దుండగుడు

అమరావతి, ఫిబ్రవరి 23: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. అమ్మవారి ఆలయం వద్ద ఉన్న స్టీల్ హుండీ తాళాన్ని గడ్డపొలుగుతో పగలకొట్టి భక్తులు సమర్పించిన కానుకలు, నగదును చోరీ చేశారు. హుండీలోని నోట్లను తీసుకుని చిల్లర నాణాలు వదలి వెళ్లాడు. ఉదయాన్నే ఆలయం తెరిచిన అర్చకులు, వాచ్‌మన్లు తాళం పగలగొట్టిన హుండీని చూసి చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే ఆలయ అధికారికి ఫోన్ చేసి సమాచారమిచ్చారు. ఈవో వేమూరి గోపి ఫిర్యాదుతో సీఐ బ్రహ్మం సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈవో కార్యాలయంలో ఉన్న సీసీ ఫుటేజిని పరిశీలించారు. రాత్రి 1 గంట సమయంలో గుర్తుతెలియని ఆగంతకుడు గడ్డపార, దుప్పటి పట్టుకుని ఆలయ మూడో ప్రాకారంలోని ఉత్తర గాలిగోపురం నుంచి ప్రవేశించి వెంకటాద్రినాయుడు మండపం వద్ద గేటుకు ఉన్న తాళం తొలగించి లోపలికి ప్రవేశించినట్లు సీసీ కెమేరాలో రికార్డు అయ్యింది. చోరీకి సంబంధించి కేసు నమోదు చేశారు. హుండీలో సుమారు 50 వేల వరకు నగదు అపహరించుకు పోయి ఉంటారని అనుమానిస్తున్నారు. ఆలయంలో ఇద్దరు నైట్ వాచ్‌మన్లు, మొదటి ప్రాకారంలో భక్తులు పడుకుని ఉన్నప్పటికీ దొంగతనం జరిగింది. ఈ పరిస్థితుల్లో ఆలయ భద్రతపై భక్తులు ఆందోళన చెందుతున్నారు.



వసతి వెతలు

- సంక్షేమ హాస్టళ్లకు ఆరునెలలుగా భోజన బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- ఎస్సీ, బీసీ, ఎస్టీ వసతి గృహాలకు రూ.16 కోట్లకు పైగా బకాయి
- కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించని వైనం
- భోజన పట్టిక అమలు చేయలేని స్థితిలో నిర్వాహకులు
- అర్ధాకలితో అలమటిస్తున్న విద్యార్థులు

నా ఎస్సీలు.. నా ఎస్టీలు.. నా బీసీలు అంటున్న సీఎం జగన్ ఆయా వర్గ విద్యార్థుల సంక్షేమాన్ని గాలి కొదిలేశాడు. పేరుకే నా అంటూ.. వారిని నిండా మోసం చేస్తున్నాడు. సదరు విద్యార్థుల సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టివేశాడు. విద్యార్థుల భోజన బిల్లులు నెలల తరబడి చెల్లించడంలేదు. అర్ధాకలితో విద్యార్థులు అలమటిస్తున్నారు. చివరకు తలనూనెకు ఇంటి నుంచి డబ్బు తెచ్చుకోవాల్సిందే. కాస్మాటిక్ ఛార్జీలు చెల్లించడంలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు రూ.16 కోట్లకు పైగా బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. విద్యార్థుల కడుపు మాడ్చలేక.. అప్పులు తీర్చలేక.. వసతి గృహాల అధికారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వారు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. కనీసం సరుకుల కొనుగోలుకు అప్పులు పుట్టని దుస్థితిని ఎదుర్కొంటున్నారు.

> ఆరునెలలుగా వసతి గృహాలకు భోజన బిల్లులు చెల్లించలేదు. హాస్టల్స్‌ను ఎలా నిర్వహించగలం. మా పరిస్థితి పగవాడికి కూడా రాకూడదు. ప్రభుత్వం డైట్ బిల్స్‌కు గ్రీన్‌ఛానల్ ఉందని చెబుతున్నా బిల్లులు చెల్లించడంలేదు. సహాయక సంక్షేమాధికారి వారి లాగిన్ నుంచి బిల్స్ ట్రెజరీకి అప్‌లోడ్ కాకుండా నిలిపివేశారు. మా 26 ఏళ్ల సర్వీసులో ఇంత దారుణం ఎప్పుడూ చూడలేదు.
> - ఓ వసతి గృహ నిర్వాహకుని ఆవేదన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణపై నిర్లక్ష్యం అలముకుంది. వేలాదిమంది విద్యార్థుల సంక్షేమానికి పాలకులు గండికొడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో తొమ్మిదివేల మంది విద్యార్థులు ఉంటూ చదువుకొంటున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. ఆరునెలలుగా వసతి గృహాల బిల్లులు ప్రభుత్వం విడుదల చేయలేదు. రూ.16 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. కాస్మొటిక్ ఛార్జీలకు సదరు విద్యార్థులు నోచుకోలేదు. వసతి గృహాల నిర్వహణకు సంబంధించిన నిధుల్లో 60శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో బిల్లులు చెల్లించలేని దుస్థితి ఏర్పడింది.

ధరలకు పొంతన లేదు..

వసతి గృహాలకు ప్రభుత్వం చెల్లించే సరుకుల ధరలకు మార్కెట్ ధరలకు పొంతనే లేదు. మార్కెట్‌లో సరకుల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. కూరగాయల ధరలు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.సరుకులు, గ్యాస్, పాలు అప్పు పద్ధతిలో కొనుగోలు చేసి బిల్లులు విడుదలైన సమయంలో వాటిని వసతి గృహాల అధికారులు చెల్లించేవారు. ఆరు నెలలుగా మెస్ బిల్లులు విడుదల కాకపోతుండటంతో షాపుల్లో అప్పు దొరకడం లేదు. ఈ నేపథ్యంలో నిర్దేశించిన భోజన పట్టికను అమలు చేయలేక పోతున్నారు. అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అప్పులు పుట్టక అవస్థలు..

ఆరు నెలలుగా బిల్లులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు ఆహారం అందించడంలో హెచ్‌డబ్ల్యూవోలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వంద మంది విద్యార్థులు ఉంటే నెలకు రూ.1.20 లక్షలు ఖర్చు అవుతోందని చెబుతున్నారు. ఇలా లెక్కిస్తే వంద మంది విద్యార్థులు ఉన్న వసతి గృహానికి ఈ నెల వరకు రూ.7.20 లక్షలు చెల్లించాల్సి ఉంది. వారికి వచ్చే జీతం కూడా సరుకుల కోసం వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు. బంగారం కుదవ పెట్టి కూడా అప్పులు చేస్తున్నవారు ఉన్నారు.

బియ్యం కొనుగోలుకు సొంతంగా చెల్లించాల్సిందే...

వసతి గృహాలకు డీలర్ల ద్వారా బియ్యం సరఫరా చేస్తారు. కిలో రూపాయి చొప్పున డీడీ రూపంలో చెల్లిస్తేనే బియ్యం వసతి గృహాలకు సరఫరా చేస్తారు. 20 కింటాళ్ల బియ్యం కొనుగోలు చేయాలంటే రూ.2వేలు డీడీ చెల్లించాలి. గతంలో ప్రభుత్వం బియ్యం కోసం డబ్బు చెల్లించేది. ఈ ప్రక్రియ కూడా నిలిచిపోయింది. హెచ్‌డబ్ల్యూవోలు వారి సొంత డబ్బు చెల్లించి బియ్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. గ్యాస్ అప్పు లభించే పరిస్థితి లేదు. గ్యాస్ కూడా నిర్వాహకులే కొనుగోలు చేస్తున్నారు. సరుకులు, పాలు, కూరగాయలు అప్పుపై సరఫరా చేసే అవకాశం ఉంది. అయితే నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో వాటికి సరఫరా కూడా కొన్ని వసతి గృహాలకు నిలిచిపోయింది.

ఎస్సీ శాఖ ముఖ్యకార్యదర్శిని కోరినా..

బిల్లులు చెల్లించాలని పదే పదే కోరుతున్నా హెచ్‌డబ్ల్యూవోల మొర ఆలకించే వారే కరువయ్యారు. ఇటీవల ఎస్సీ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ నిర్వహించిన సమావేశంలో బిల్లుల బకాయిల అంశాన్ని హెచ్‌డబ్ల్యూవోలు ప్రస్తావించారు. బిల్లులు చెల్లించాలని కోరినా వారు నేటికీ స్పందించక పోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో బిల్లులు తక్షణమే చెల్లించకపోతే వసతి గృహాలను మూసివేయాలని సదరు అధికారుల సంఘం నిర్ణయించింది. ఈమేరకు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిని కలసి లేఖ ఇవ్వాలని యూనియన్ నిర్ణయించినట్లు వారు చెబుతున్నారు. ఇదే జరిగితే విద్యార్థులు వసతి గృహాల నుంచి ఇంటికి వెళ్లాల్సి వస్తుంది.

కాస్మాటిక్ ఛార్జీలు చెల్లించలేదు..

ప్రభుత్వం విద్యార్థులకు నెలవారీ కాస్మోటిక్ ఛార్జీల నగదు ఇవ్వడం లేదు. దీంతో తలనూనె కొనాలన్నా, సబ్బు కావాలన్నా ఇంటి వైపు చూడక తప్పడంలేదు. ప్రతి నెలా తమ తల్లిదండ్రులను ఖర్చులకు డబ్బులు పంపమని అడగడం పరిపాటిగా మారింది. వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రతి నెలా కాస్మొటిక్ ఛార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వ తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున తల నూనె, సబ్బులు ఇతర సామాగ్రి కొనుగోలుకు ఇస్తుంది. బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ ఛార్జీల కింద అదనంగా విడుదల చేస్తుంది. విద్యార్థుల బ్యాంకు ఖాతాలకే నేరుగా కాస్మొటిక్ ఛార్జీలను జమ చేయాలి. ఆరు నెలలుగా ఛార్జీల ఊసేలేదు.

కనీస వసతులకు నిధులు లేవు..

వసతి గృహాల నిర్వహణకు నిధులు విడుదల కావడంలేదు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు నిర్వాహకులు వాపోతున్నారు. చివరకు మాడిపోయిన బల్బును మార్చాలన్నా వారి జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి, అవసరమైన మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదు. కనీస వసతులకు హెచ్‌డబ్ల్యూవోలు సొంతంగా ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందన్న విమర్శలున్నాయి.

ఖర్చు నెలకు రూ.2,200.. ఇచ్చేది రూ.1,400

కళాశాలల విద్యార్థులకు నెలకు రూ.1,600, స్కూల్స్ విద్యార్థులకు నెలకు రూ.1,400 భోజనం కోసం ప్రభుత్వం చెల్లిస్తోంది. కళాశాలల విద్యార్థులకు రోజు వసతి గృహంలో ఉదయం టిఫిన్, రెండు పూటల భోజనం అందించాలి. స్కూల్స్ విద్యార్థులకు ఉదయం టిఫిన్, ఒక పూట భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించాలి. స్కూల్స్ సెలవు రోజుల్లో రెండు పూటలా భోజనం వడ్డించాలి. కళాశాలల విద్యార్థులకు రోజుకు రూ.53.33, స్కూల్ విద్యార్థులకు రోజుకు రూ.46.66కు భోజనం, ఉదయం టిఫిన్ అందించాలి. ఉదయం అల్పాహారం రోజుకో రకం వేరుశనగ చట్నీతో, బెల్లంతో రాగి జావ, చిక్కీలు, రాత్రి భోజనం, అరటి పండు, వారంలో మూడు రోజుల చికెన్, ఆరు రోజులు ఉడికించిన గుడ్డు ఇవ్వాలి. పాలు అందించాలి. ఇలా మెనూ అమలుకు ఒక్కో విద్యార్థికి నెలకు రూ.2,200 ఖర్చు అవుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. మెనూ ఛార్జీలు పెంచాలని పదే పదే వినతిపత్రాలు అందిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెనూ ప్రకారం ఇవ్వాలంటే తమ జీతాలు కూడా సరిపోవని కొందరు నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వం వసతి గృహాల్లో భోజనానికి సంబంధించి సరుకుల ధరలు మార్కెట్ కనుగుణంగా పెంచకుండా విద్యార్థుల కడుపు కాల్చుతోంది.

బీసీ, ఎస్టీ వసతి గృహాలకు బిల్లుల బకాయి

ఎస్సీలే కాదు బీసీ, ఎస్టీ వసతి గృహాలకు కూడా నెలల తరబడి భోజన బిల్లులు చెల్లిండంలేదు. ఈ విద్యాసంవత్సరంలో ఆయా వసతి గృహాలకు అక్టోబరు వరకే బిల్లులు చెల్లించినట్లు సదరు అధికారులు తెలిపారు. దాదాపు నాలుగునెలలుగా బీసీ, ఎస్టీ వసతి గృహాలకు బిల్లులు నిలిచిపోయాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బిల్లులు చెల్లించక పోవడంతో నిర్వాహకులు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందుకు ఎదుర్కొంటున్నారు. బీసీ వసతి గృహాలకు రెండు మూడింటికి ఒకే అధికారి ఉన్నారు. దీంతో బకాయిలు పేరుకుపోవడంతో వసతి గృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తే బిల్లులు విడుదల కావన్న ఆందోళన వసతి గృహాల అధికారుల్లో నెలకొంది.


నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

వైసీపీకి.. బిగ్‌షాక్







- 26న టీడీపీలోకి నరసరావుపేట ఎంపీ లావు
- రాయలు వెంటే ఎమ్మెల్సీ జంగా.. మాజీ ఎమ్మెల్యే మక్కెన
- వీరి బాటలోనే పలువురు నేతలు, స్థానిక ప్రజా ప్రతినిధులు

(నరసరావుపేట, నరసరావుపేట)

పల్నాడు జిల్లాలో వైసీపీకి బిగ్‌షాక్ తగలనున్నది. ఆ పార్టీని వీడి సీనియర్లు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. వైసీపీకి రాజీనామా చేసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ నెల 26న టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ, గురజాల మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు టీడీపీలో చేరనున్నారు. వీరితో పాటు పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూడా ఆ పార్టీలో చేరనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీరందరూ 26న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరేందుకు ముహూర్తం ఖరారైంది. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి వైపీపీకి రానున్న రెండు రోజుల్లో రాజీనామా చేయనున్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ జంగా రెండు రోజుల క్రితం ఉండవల్లిలోని చంద్రబాబు గృహానికి వెళ్లారు. ఈ భేటీలో ఎంపీ లావు, మాజీ ఎమ్మెల్యే యరపతినేని కూడా ఉన్నారు. వారి మధ్య జరిగిన చర్చలు సఫలమయ్యాయి. ఈ క్రమంలో గురజాల నియోజకవర్గంలో ప్రత్యర్థులుగా ఉన్న జంగా, యరపతినేని ఇద్దరూ ఒకే పార్టీలో కలిసి పనిచేయనున్నారు. ఎంపీ రాయలు, ఎమ్మెల్సీ జంగా, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుల వెంట పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వెళ్లకుండా చేసేందుకు వైసీపీ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరు వైసీపీని వీడకుండా ఉండేవిధంగా రాజీ చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. అయితే లావుతో టచ్‌లో ఉన్న వైసీపీ సీనియర్ నేతలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు టీడీపీలో చేరతారన్న టాక్ ఉంది.

పకడ్బందీగా పది పరీక్షలు నిర్వహించాలి

అధికారులకు కలెక్టర్ శివశంకర్ ఆదేశాలు

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 23: త్వరలో జరగనున్న పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శివశంకర్ తెలిపారు. పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెట్లు, డిపార్ట్‌మెంట్ అధికారుల ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం భువనచంద్ర టౌన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచి, పరీక్షలపై అవగాహన కల్పించాలన్నారు. పరీక్షలప్పుడు కనికరం, దయ వంటివి చూపకూడదని సూచించారు. గత సంవత్సరం కన్నా మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు. విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 127 కేంద్రాలలో జరిగే పరీక్షలకు ప్రభుత్వ ప్రైవేటు విద్యార్థులు 29244 మంది హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి వేణుగోపాలరెడ్డి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ హుస్సేన్, జిల్లా సైన్స్ సమన్వయకర్త మధుకుమార్ పాల్గొన్నారు.

రేపు సర్వీస్ కమిషన్ పరీక్ష

ఆదివారం జరిగే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ శివశంకర్ తెలిపారు. పరీక్షలపై శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మొత్తం 9778 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారన్నారు. నరసరావుపేటలో 25, సత్తెనపల్లిలో 2, చిలకలూరిపేటలో 1 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులను ఉదయం 9.30 నుంచి 10.30 గంటల మధ్య కేంద్రాల్లో అనుమతించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్వో అజయ్‌కు మార్, ఆర్డీవోలు రమాకాంతరెడ్డి, మురళి పాల్గొన్నారు.

కీచక వలంటీరుకు వత్తాసు

- న్యాయం చేయాల్సిన వారే నేరస్తుడికి అండ
- ఆత్మహత్యకు యత్నించినా స్పందన అంతంతే
- బాలికలను వేధించిన కేసు నీరు కార్చే యత్నం
- నామమాత్రపు సెక్షన్లతో కేసు నమోదు
- పోలీసు అధికారులపై అధికార పార్టీ నేతల ఒత్తిడి
- శ్రీకాంత్‌రెడ్డిపై పోక్సో చట్టం అమలు అడ్డుకుంటున్న వైనం


నరసరావుపేట, ఫిబ్రవరి 23: కీచక వలంటీరు వేధింపులు తాళలేక ఓ బాలిక చదువు మానుకోగా.. మరో బాలిక ఆత్మహత్యకు ప్రయత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఇంత జరిగినా వలంటీరుపై పోక్సో కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు వత్తాసు పలుకుతున్నారు. న్యాయం చేయాల్సిన వారే నేరస్తుడికి కొమ్ము కాస్తున్నారని పలువురు విమర్శిస్తున్నా అధికారులు లెక్క చేయడంలేదు. నరసరావుపేట మండలం పాలపాడు వలంటీర్ పిట్టు శ్రీకాంత్‌రెడ్డి అకృత్యాలపై పోలీసులు సరైన రీతిలో స్పందించడం లేదన్న విమర్శలున్నాయి. అతడి వేధింపులు తాళలేక బలహీన వర్గాలకు చెందిన బాలిక ఐఐఐటీ విద్యకు దూరమైనా, ఆమె చెల్లి పురుగులు మందు తాగినా గ్రామంలో ఎవరూ వారికి అండగా నిలవక పోవడం గమనార్హం. బాలికలకు రక్షణగా 2012లో పార్లమెంటు ఆమోదించిన పోక్సో చట్టాన్ని తుంగలో తొక్కి వలంటీర్‌ను రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిడితో పోలీసులు నామమాత్రపు సెక్షన్లు (506, 509, 354 ఏ, డీ - ఐపీసీ) కింద కేసు నమోదు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తప్పుదోవ పట్టించిన పోలీసులు

వేధింపులకు గురైన అమ్మాయి మైనర్ కాదు కదా అని పోలీసు అధికారి ప్రశ్నతో టీడీపీ నేతలు ఖంగుతిన్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులతో ఐఐఐటీలో సీటు సాధించిందని చెప్పడంతో పోలీసు అధికారి మిన్నకుండిపోయారు. ఆ తర్వాత బాధిత బాలికను పిలిపించగా వలంటీర్ వేధింపులను ఆమె వివరిస్తూ విలపించింది. కళాశాలకు కూడా ఫోన్ చేసి వేధించాడని, ఆ బాధలను తట్టుకోలేక చదువు మానేయాల్సి వచ్చిందని బాలిక ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో సదరు అధికారి హడావుడి చేసి కింది అధికారులను పిలిచి ఫోక్సో చట్టాన్ని పరిశీలించాలని ఆదేశించారు. దీనినిబట్టి ఉన్నతాధికారిని సైతం కేసు దర్యాప్తు అధికారులు తప్పుదారి పట్టించారని టీడీపీ నేతలు విమర్శించారు.

ఫోక్సో కేసు నమోదు చేయాలని వినతి

నరసరావుపేట లీగల్: పాలపాడు గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలను వేధించిన వలంటీరు శ్రీకాంత్‌రెడ్డిపై ఫోక్సో కేసు నమోదు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, టీడీపీ నరసరావుపేట ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు, రాష్ట్ర ముదిరాజుల సాధికారిత కమిటీ కన్వీనర్ పీఎల్ రావు, నేతలు నల్లపాటి రామచంద్ర ప్రసాదు, పులిమి రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కనపర్తి మాట్లాడుతూ శ్రీకాంత్‌రెడ్డిపై ఫోక్సో కేసు నమోదు చేయకుండా ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. వలంటీర్ వేధిస్తే బాధితుల వర్గానికి చెందిన మంత్రి విడదల రజిని ఎక్కడ నిద్ర పోతున్నారని ప్రశ్నించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలికను పరామర్శించడానికి ఇంతవరకు అధికారులు, వైసీపీ నాయకులు వెళ్లక పోవడం సిగ్గు చేటన్నారు. వలంటీర్లే సైన్యమని చెపుతున్న జగన్ ప్రజలకు ఇప్పుడేం సమాధానం చెపుతారని నిలదీశారు. డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ జగన్ పొరపాటున తిరిగి అధికారంలోకి వస్తే మహిళలు, బడుగు, బలహీన వర్గాల వారు రోడ్ల మీద తిరిగే పరిస్థితి ఉండదన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, అష్మతుల్లా, శీలు బాబూరావు, సురేంద్ర, శంకర్, కోటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కనపర్తి శ్రీనివాసరావు , రామిరెడ్డి, రాము తదితరులు



మరోసారి క్వీన్ రాక

కంగనా రనౌత్‌కు కథానాయికగా విశిష్ట గుర్తింపు తెచ్చిన బాలీవుడ్ చిత్రం 'క్వీన్'. పదేళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. చాలాకాలంగా ప్రేక్షకులు 'క్వీన్'కు సీక్వెల్ చేయాలని కంగనను కోరుతున్నారు. వారి కోరిక త్వరలోనే నెరవేరబోతోంది. 'క్వీన్ 2' చిత్రానికి స్క్రిప్ట్ సిద్ధం చేసినట్లు దర్శకుడు వికాస్ బహల్ తెలిపారు. సీక్వెల్‌లోనూ కంగన రనౌత్ రాణీగా లీడ్ రోల్ లో కనిపించనున్నారు. త్వరలోనే ప్రీ ప్రొడక్షన్ ప్రారంభించి, ఆగస్టు కల్లా సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తామని వికాస్ తెలిపారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

దుబాయ్‌లో గామా అవార్డుల వేడుక



తెలుగు చిత్ర పరిశ్రమ గర్వపడేలా మార్చి 3న దుబాయ్‌లో 'గామా' అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా నిర్వహించనున్నారు. జ్యూరీ ఛైర్మన్, సంగీత దర్శకుడు కోటి, జ్యూరీ సభ్యులు... నిర్మాత డీవీవీ దానయ్య, దర్శకుడు వీఎన్ ఆదిత్య తదితరులు శుక్రవారం ఈ వేడుకకు సంబంధించిన ట్రోఫీని ఆవిష్కరించారు. పలు విభాగాల్లో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తులకు ఈ పురస్కారాలు అందజేస్తామనీ, పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతారనీ కోటి తెలిపారు. సినీ రంగంలో కొత్త ప్రతిభను ప్రోత్సహించడానికి త్రిమూర్తులు నిర్వహిస్తున్న ఈ వేడుక తెలుగు చిత్ర పరిశ్రమకు గర్వకారణమని డీవీవీ దానయ్య, వీఎన్ ఆదిత్య చెప్పారు.

పిల్లబచ్చాలు మా సినిమాకు రావొద్దు



అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న డిఫరెంట్ హారర్ థ్రిల్లర్ 'తంత్ర'. ధనుష్ రఘుముద్రి కథానాయకుడు. సలోనీ కీలకపాత్రలో నటిస్తున్నారు. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేశ్‌బాబు పి, రవిచైతన్య నిర్మిస్తున్నారు. తమ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ రావడంపై 'తంత్ర' టీమ్ వినూత్నంగా స్పందించింది. 'మా సినిమాకు పిల్లబచ్చాలు రావొద్దు' అని పేర్కొంటూ పోస్టర్ రిలీజ్ చేసింది. హారర్ ఎలిమెంట్స్‌తో తమ సినిమా థ్రిల్ చేస్తుందనీ, త్వరలో ట్రైలర్ విడుదల చేస్తామని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: ఆర్ఆర్ ధ్రువన్. సినిమాటోగ్రఫీ: సాయిరామ్ ఉదయ్, విజయ్ భాస్కర్ సద్దాల.

మార్కెట్‌లో మహాలక్ష్మి సందడి



'కేరింత' ఫేం పార్వతీశం కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. ప్రణీకాన్వికా కథానాయిక. వీఎస్ ముఖేశ్ యువ దర్శకత్వంలో అఖిలేశ్ కలారు నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను హీరో శ్రీ విష్ణు ఆవిష్కరించారు. "మార్కెట్ మహాలక్ష్మి' టీజర్‌లో హీరో హీరోయిన్ పాత్రలు ఫన్నీగా అనిపించాయి. పార్వతీశం కామెడీ టైమింగ్ బావుంది. దర్శకుడి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో ఈ చిత్రం తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. 'ఆకట్టుకునే ప్రేమకథతో పాటు కుటుంబ అనుబంధాలను మనసుకు హత్తుకునేలా తెరకెక్కిస్తున్నాం' అని నిర్మాత తెలిపారు.

బ్యాడ్‌బాయ్స్ లవ్‌స్టోరీ



వినూత్న ప్రేమ కథా చిత్రం 'వుయ్ లవ్ బ్యాడ్‌బాయ్స్'. రాజు రాజేంద్ర ప్రసాద్ దర్శకత్వంలో పప్పుల కనకదుర్గారావు నిర్మించారు. ఇటీవలే సెన్సార్ పూర్తయిన ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు వశిష్ఠ విడుదల చేసి, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. అలీ, సప్తగిరి, భద్రం ప్రధాన తారాగణం. నేటి ట్రెండ్‌కు తగినట్లు కామెడీ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించామనీ, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు. రఘు కుంచెతో కలసి భూషణ్ జాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: వీకే రామరాజు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/D9npawbలో చదవండి.



దిక్సూచి DIKSUCHI



ఏపీ ఆర్‌సెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ) తరపున తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ(ఎస్‌వీయూ)- రీసెర్చ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ ఆర్‌సెట్) 2023-24 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్ ద్వారా పార్ట్ టైం/ఫుల్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, అనుబంధ కళాశాలలు, రీసెర్చ్ సెంటర్లలో అడ్మిషన్స్ ఇస్తారు.

యూనివర్సిటీలు-సీట్లు

యూనివర్సిటీ	ఫుల్ టైమ్	పార్ట్ టైమ్
ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు	155	76
ఆదికవి నన్నయ యూనివర్సిటీ, రాజమండ్రి	86	36
ఆంధ్ర కేసరి యూనివర్సిటీ, ఒంగోలు	43	37
ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖపట్నం	131	70
డా.బీ.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం	15	12
ద్రవిడియన్ యూనివర్సిటీ, కుప్పం	33	30
జేఎన్‌టీయూ, అనంతపురం	86	298
జేఎన్‌టీయూ, కాకినాడ	-	426
జేఎన్‌టీయూజీ, విజయనగరం	1	14
కృష్ణ యూనివర్సిటీ, మచిలీపట్నం	33	12
రాయలసీమ యూనివర్సిటీ, కర్నూలు	2	3
ఆర్‌జీయూకేటీ, నూజివీడు	5	7
ఆర్‌జీయూకేటీ, ఆర్‌కే వ్యాలీ	5	5
శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ, అనంతపురం	45	31
శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, తిరుపతి	69	56
శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి	114	95
విక్రం సింహపురి యూనివర్సిటీ, నెల్లూరు	31	14
యోగి వేమన యూనివర్సిటీ, కడప	84	27

స్పెషలైజేషన్‌లు: అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, బుద్దిస్ట్ స్టడీస్, కామర్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లీష్, ఫైన్‌ఆర్ట్స్, ఫోక్‌లోర్, హిందీ, హిస్టరీ, ఇంటర్నేషనల్ అండ్ ఏరియా స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, లా, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, లింగ్విస్టిక్స్, మేనేజ్‌మెంట్, మ్యూజిక్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిలాసఫీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, డా.బీఆర్.అంబేద్కర్ స్టడీస్, రూరల్ డెవలప్‌మెంట్, సోషల్ వర్క్, సోషియాలజీ, సంస్కృతం, తెలుగు, టూరిజం మేనేజ్‌మెంట్, ఉమన్ స్టడీస్, అప్లయిడ్ లైఫ్ సైన్సెస్, బయో కెమిస్ట్రీ, బోటనీ, కెమికల్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జాగ్రఫీ, జియాలజీ, హోం సైన్స్, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, సెరికల్చర్, స్టాటిస్టిక్స్, జువాలజీ, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్, ఫార్మసీ, బయోటెక్నాలజీ, కంపారటివ్ ద్రవిడియన్ లిటరేచర్, తుళు, మహాత్మా జ్యోతి రావు పూలే స్టడీస్, ఉర్దూ, జియో ఇంజనీరింగ్, మెటియోరాలజీ అండ్ ఫిజికల్ ఓషనోగ్రఫీ.

అర్హత వివరాలు: కనీసం 55 శాతం మార్కులతో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, కామర్స్, లా, ఫార్మసీ, ఇంజనీరింగ్ విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. అనుభవం ఉన్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏపీ ఆర్‌సెట్ వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్లో స్పెషలైజేషన్‌కు సంబంధించిన రీసెర్చ్ మెథడాలజీ నుంచి 70 ప్రశ్నలు, రెండో సెక్షన్లో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 70 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. ఇందులో అర్హత పొందాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 45 శాతం మార్కులు రావాలి. ఈ టెస్ట్‌లో అర్హత పొందినవారిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు. దీనికి 60 మార్కులు నిర్దేశించారు.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; బీసీ అభ్యర్థులకు రూ.1300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **చివరి తేదీ:** మార్చి 19
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in/rcet

బిట్స్ పిలానీ డబ్ల్యుఐఎల్పీ - పీజీ డిప్లొమాలు

ప్రసిద్ధ సాంకేతిక విద్యా సంస్థ - బిట్స్ పిలానీకి చెందిన వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్(డబ్ల్యుఐఎల్పీ) విభాగం మూడు సరికొత్త పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లను ప్రకటించింది. కెరీర్‌కు ఎలాంటి బ్రేక్ ఇవ్వకుండానే ఈ కోర్సులను చేసే అవకాశాన్ని బిట్స్ కల్పిస్తోంది. మార్చి 18లోపు వీటికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ స్మార్ట్ మొబిలిటీ:** స్మార్ట్ మొబిలిటీ కాన్సెప్టులు, టెక్నాలజీలు, పాలసీలపై సమగ్ర అవగాహన కల్పించే విధంగా ఈ ప్రోగ్రామ్‌ని మలిచారు. మరిన్ని వివరాలకు - https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-smart-mobility.php
- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ ఎలక్ట్రికల్ వెహికల్స్:** ఎలక్ట్రిక్ వెహికల్స్ డిజైన్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్, ఈవీ రెగ్యులేషన్స్ తదితరాలను కలుపుతూ ఈ ప్రోగ్రామ్‌ని తీర్చిదిద్దారు మరిన్ని వివరాలకు - https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-electric-vehicles.php
- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ ఆటోమోటివ్ సైబర్ సెక్యూరిటీ:** సైబర్ సెక్యూరిటీ సిస్టమ్స్‌పై సంపూర్ణ అవగాహన కలిగించే విధంగా ఈ కోర్సును మలిచారు. https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-automotive-cybersecurity.php

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/F6CVv3zలో చదవండి.

జాబ్ కార్నర్

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 3000 అప్రెంటిస్‌లు

ముంబయిలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్(రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డివిజన్) సెంట్రల్ ఆఫీస్... దేశవ్యాప్తంగా రీజియన్ల వారీగా బ్యాంకు శాఖల్లో అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీలు: 100 (గుంటూరు- 40, విజయవాడ-30, విశాఖపట్నం-30)

తెలంగాణలో ఖాళీలు: 90(హైదరాబాద్-58, వరంగల్-38)

శిక్షణ కాలం: ఒక సంవత్సరం

అర్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

స్టయిపెండ్: నెలకు రూరల్/సెమీ అర్బన్ శాఖలు రూ.15,000. పట్టణ శాఖలు రూ.15,000. మెట్రో శాఖలు రూ.15,000.

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ధ్రువపత్రాల పరిశీలన, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష: ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 1. క్వాంటిటేటివ్, జనరల్ ఇంగ్లిష్, రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్. 2. బేసిక్ రిటైల్ లయబిలిటీ ప్రొడక్ట్స్. 3. బేసిక్ రిటైల్ అసెట్ ప్రొడక్ట్స్ 4. బేసిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్ 5. బేసిక్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు.

దరఖాస్తు రుసుము: రూ.800. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్/ మహిళా అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులకు రూ.400.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: మార్చి 6

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: మార్చి 10

వెబ్‌సైట్: www.centralbankofindia.co.in/en

సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో 1425 ఖాళీలు

బిలాస్‌పూర్(ఛత్తీస్‌గఢ్)లోని కేంద్ర బొగ్గు గనుల శాఖకు చెందిన సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎస్ఈసీఎల్)... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: గ్రాడ్యుయేట్ ఇంజనీర్(మైనింగ్/ఎలక్ట్రికల్/మెకానికల్/సివిల్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్). డిప్లొమా(మైనింగ్/మైనింగ్, మైన్ సర్వేయింగ్/మెకానికల్/సివిల్ ఇంజనీరింగ్)

అర్హత: సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఉత్తీర్ణత సంవత్సరం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 27

వెబ్‌సైట్: www.seclcil.in/index.php

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీలో 490 జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు

న్యూఢిల్లీలోని ప్రభుత్వరంగ సంస్థ... ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా... దేశ వ్యాప్తంగా ఉన్న ఏఏఐ కార్యాలయాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఆర్కిటెక్చర్): **3 పోస్టులు**
2. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్ - సివిల్): **90 పోస్టులు**
3. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్ - ఎలక్ట్రికల్): **106 పోస్టులు**
4. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఎలక్ట్రానిక్స్): **278 పోస్టులు**
5. జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ): **13 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్/ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ గేట్ 2024 స్కోరు ఉండాలి.

దరఖాస్తు రుసుము: రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఏప్రిల్ 2 **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 1

వెబ్‌సైట్: www.aai.aero/







వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

రాజధాని అమరావతిపై వైసీపీ కుట్ర

● 1,528వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 23: రాష్ట్రానికి సంపదనిచ్చే రాజధాని అమరావతిని వైసీపీ ప్రభుత్వం మూడుముక్కల ఆటతో సర్వనాశనం చేసిందని 33వేల ఎకరాలను త్యాగం చేసిన రైతులు అన్నారు. అమరావతిని భ్రమరావతి అని ప్రపంచానికి తప్పుడు ప్రచారం చేశారన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1528వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు రాజధాని రైతు ధర్నా శిబిరాల నుంచి మాట్లాడుతూ రాజధాని అమరావతిని, రాష్ట్ర ప్రజల జీవనాడి అయిన పోలవరాన్ని జగన్‌రెడ్డి విస్మరించాడన్నారు. ఆంధ్రప్రదేశ్‌ని 20 ఏళ్ల వెనకబాటుకు గురిచేశారన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి భైర్లు కమ్మిన కళ్లను తెరవాలన్నారు. రాజధానిని నాశనం చేయటం వెనక కుట్ర దాగి ఉందన్నారు. రైతులు చేస్తున్న ఉద్యమాన్ని అవమాన పరిచారన్నారు. హైకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. తుళ్లూరు, వెంకటపాలెం, వెలగపూడి, మందడం, నెక్కల్లు, అనంతవరం తదితర రాజధాని గ్రామాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

ఉత్సాహంగా ఎడ్ల బలప్రదర్శన


సీనియర్స్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన ఎడ్లజత

మాచవరం, ఫిబ్రవరి 23: మాచవరం మండలం మోర్జంపాడు గ్రామంలో వేంచేసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి 68వ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగు రోజులుగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన సీనియర్స్ విభాగంలో మొత్తం ఐదు జతలు పాల్గొనగా గుంటూరు జిల్లా తాడేపల్లి గ్రామానికి చెందిన లంకిరెడ్డి నిక్షిత్‌రెడ్డి, కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామానికి చెందిన మేకా కృష్ణమోహన్ కంబైన్డ్ ఎడ్లజత ప్రథమస్థానంలో నిలిచాయి. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజుర్‌నగర్ గ్రామానికి చెందిన నుంకి సురేందర్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన డి.రోహన్‌బాబు కంబైన్డ్ ఎడ్ల జత ద్వితీయ, కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామానికి చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్లు మూడవ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా లింగాయపాలెం గ్రామానికి చెందిన యల్లం సాంబశివరావు ఎడ్లు నాల్గవ, పొన్నూరు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన దాసరి నారాయణరావు ఎడ్లు ఐదవ స్థానంలో నిలిచాయి.

రేపు మంగళగిరి ఎయిమ్స్ జాతికి అంకితం

● వర్చువల్‌గా చేయనున్న ప్రధాని నరేంద్ర మోదీ
● 9 క్రిటికల్ కేర్ బ్లాకులకు శంకుస్థాపన
● విశాఖలో మైక్రోబయాలజీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్
● ఏపీలో 4 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 23: కేంద్ర ప్రభుత్వం మంగళగిరిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం జాతికి అంకితం చేయనున్నారు. వర్చువల్ విధానంలో ఆయన ఎయిమ్స్‌ను జాతికి అంకితం చేయడంతోపాటు 9 క్రిటికల్ కేర్ బ్లాకులకు శంకుస్థాపన, విశాఖపట్నంలో మైక్రోబయాలజీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ, ఏపీలో మొత్తం నాలుగు మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రారంభించనున్నారు. మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎయిమ్స్ డైరెక్టర్ అండ్ సీఈవో డాక్టర్ మధుబానందకర్ వివరాలను వెల్లడించారు. 25న జరిగే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు డాక్టర్ మన్సూఖ్ మాండవ్య, ప్రహ్లాద జోషి, డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్, ఎస్పీ సింగ్ బఘేల్, ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని హాజరుకానున్నారని చెప్పారు.



2015, డిసెంబరు 19న 183.11 ఎకరాల విస్తీర్ణంలో రూ.1618.23 కోట్ల వ్యయంతో మంగళగిరి ఎయిమ్స్‌కు ఆనాటి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా శంకుస్థాపన చేశారని తెలిపారు. ఎయిమ్స్‌లో వైద్య కళాశాల, మెడికల్ ల్యాబ్, నర్సింగ్ కళాశాల, ఓపీడీ, ఇన్‌పేషెంట్, అత్యవసర సేవలు, రెసిడెన్షియల్ బ్లాక్, గెస్ట్ హౌస్, లైబ్రరీ, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ధర్మశాల బిల్డింగ్, ఆయుష్, ఆడిటోరియం, ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తిచేసుకుని అందుబాటులోకి వచ్చాయన్నారు. 2019, మార్చి 12 నుంచి అవుట్ పేషెంట్ విభాగం పనిచేస్తుండగా, ప్రస్తుతం ఓపీడీలో ప్రతిరోజు రోగుల సగటు 2,500గా వుందన్నారు. ఈ నెల 20వ తేదీ నాటికి 15 లక్షల ఓపీ సేవలు అందించినట్టు చెప్పారు. ఇప్పటివరకు 20 వేల మందికి పైగా ఇన్‌పేషెంట్ అడ్మిషన్లు, మరో 12 వేల మంది అత్యవసర సేవలు పొందినట్టు తెలిపారు. ఎంబీబీఎస్ కోర్సులో 2018లో ప్రారంభించగా, ప్రస్తుతం 600 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు చదువుకుంటున్నారని స్పష్టం చేశారు. మరో వంద మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో పీజీ కోర్సులను అభ్యసిస్తున్నారని వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పారామెడికల్ కోర్సులను కూడా ప్రారంభించాలని యోచిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిషన్స్) శశికాంత్ తుమ్మా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వినీత్ థామస్ అబ్రహాం, అధికార ప్రతినిధి డాక్టర్ కే.వంశీకృష్ణ పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొడుతున్న కిలారి



● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి22: కులమతాల పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రయత్నిస్తున్నారన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆరోపించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మామ్మ అల్లుళ్ల ఉమారెడ్డి, కిలారి భాగోతాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. ఉమారెడ్డి వెంకటేశ్వర్లు ఎంపీగా పోటీ చేస్తే ఆయన సొంత నియోజకవర్గం బాపట్లలో మెజార్టీ రాలేదని, పొన్నూరులో వచ్చిన మెజారిటీతోనే ఆయన ఎంపీగా గెలిచారని గుర్తు చేశారు. తాము ఎంపీగా గెలిపిస్తే తనపై తన్న తమ్ముడిపై 20 మంది టీడీపీ కార్యకర్తలపై హత్య కేసు పెట్టించాడనా ఆవేదన వ్యక్తం చేశారు. తాను నోరు తెరిస్తే మామ్మ అళ్లులు నోరుకూడా ఎత్తలేనన్నారు. మామ అల్లుళ్ల చరిత్రే కాదు, ఇప్పుడు ఎంపీ అభ్యర్థిగా ఉన్న ఉమారెడ్డి వెంకట రమణ చరిత్ర కూడా తన దగ్గర ఉందన్నారు. చట్టపరమైన చర్యలు ప్రారంభించి వీళ్ల భాగోతాలను ప్రజల ముందు ఉంచనున్నట్లు నరేంద్ర కుమార్ హెచ్చరించారు. పొన్నూరు టికెట్టు తెచ్చుకుంటే ప్రజాక్షేత్రంలో పోరాడదామన్ని ఎమ్మెల్యే కిలారికి నరేంద్ర కుమార్ సవాలు చేశారు.

జగన్ పాలనలో మైనార్టీలకు తీరని ద్రోహం

● టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముస్తాక్


ప్రసంగిస్తున్న టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముస్తాక్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 23: ముస్లి మైనార్టీల సంక్షేమం కోసం కేటాయించిన రూ.వేల కోట్లను జగన్ రెడ్డి ప్రభుత్వం దారిమళ్లించి ముస్లిం, మైనార్టీలకు తీరని ద్రోహం చేసిందని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముస్తాక్ అన్నారు. మంగళగిరి నియోజకవర్గ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం పట్టణంలోని ఈద్గా ఫంక్షన్ హాలులో శుక్రవారం జరిగింది. సమావేశానికి టీడీపీ, జనసేన మైనార్టీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. తొలుత పట్టణంలో బైకుర్యాలీ నిర్వహించారు. వేదికపై స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహమ్మద్ ఇబ్రహీం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ముస్లిం మైనార్టీలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, మైనార్టీల సమస్యలపై చర్చించారు. ముస్తాక్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే మైనార్టీలకు అన్ని విధాలా సంక్షేమ ఫలాలు అందాయన్నారు. దైవ దర్శనానికి హజ్‌యాత్రకు వెళ్లేవారికి హజ్‌హౌస్‌ల నిర్మాణం, సబ్సిడీలు, దుల్హన్ పథకం అందిస్తానని వాగ్దానం చేసిన జగన్‌రెడ్డి హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్రంలో 80 ముస్లిం మైనార్టీ కుటుంబాలపై దాడులు జరిగితే సీఎం జగన్ నుంచి కనీస స్పందన లేదన్నారు. ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేసి వడ్డీలేని రుణాలను అందిస్తానని చెప్పి మైనార్టీలను దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. మైనార్టీలకు తీరని ద్రోహం చేసిన జగన్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలంతా ఐక్యంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి మహమ్మద్ నసీర్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, అధికార ప్రతినిధులు నాగుల్‌మీరా, సయ్యద్ రఫీ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నేత ఎంఎస్ బేగ్, హెచ్ఆర్డీ సభ్యుడు ఎస్పీ సాహెబ్, గుంటూరు పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ గని, టీడీపీ మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మజీద్, పట్టణ అధ్యక్షుడు షేక్ సుభానీ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

స్పైసెస్ వ్యాపార రంగంలోకి సంగం డెయిరీ

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ● మార్కెట్‌లోకి కారం, పసుపు, మషాలాల విడుదల

చేబ్రోలు, ఫిబ్రవరి23: వినియోగదారుల అవసరాలకు అనుగుణంగాఆ సంగం డెయిరీ స్పైసెస్ వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన్నట్లు డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. వడ్లమూడి సంగం డెయిరీలో శుక్రవారం సంగం ఉత్పత్తులను నరేంద్రకుమార్ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు, సంగం స్పైసీ చిల్లీ పౌడర్, పసుపు పొడి, చికెన్ మసాల, సాంబార్ పౌడర్, గరం మసాలను వివిధ ప్యాకింగ్‌లలో మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 5,796 గ్రామాల్లో లక్షన్నర మంది పాడిరైతులతో సంగం డెయిరీ విస్తరించినట్లు చెప్పారు. రోజుకు 7.80 లక్షల లీటర్ల పాల సేకరణ చేస్తున్నామన్నారు. గుంటూరు జిల్లా అంటే కారంకు ప్రసిద్ధి అన్నారు. దుగ్గిరాల పసుపుకు పేరు కాంచిందన్నారు. గుంటూరు జిల్లాలో రైతులు పండించే ప్రతి పంటను సంగం ద్వారా మార్కెట్‌లోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా ఉన్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను సంగంతో భాగస్వామ్యం చేసుకొని వ్యవసాయ ఉత్పత్తులను సంగం కో ప్యాకింగ్ ద్వారా మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 8 వేల మందికి పైగా డిస్ట్రిబ్యూటర్లు, ఏజెంట్ల ద్వారా 92 రకాల పాలు, పాల పదార్థాలు, ఇతర ఆహార ఉత్పత్తులు, 174 పరిమాణాల్లో వినియోగదారుల గృహాలకు చేరవేస్తున్నామని అన్నారు. మసాల దినుసులను పుష్పా ఆగ్రోటెక్ సంస్థతో ఒప్పందం చేసుకొని సంగం కో ప్యాకింగ్‌లో మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన్నట్లు చెప్పారు. నాణ్యతతో రాజీపడకుండా అత్యంత నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అందచేస్తున్నట్లు వివరించారు. సంగం డెయిరీ ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలన్ని విజ్ఞప్తి చేశారు. అలాగే వెన్న, నెయ్యిలో కల్తీలను పరీక్షించే హైపెర్ఫామెన్స్ లీక్విడ్ క్రోమోటోగ్రఫీ అధునాత యంత్రాలను విదేశాల నుంచి తెప్పించి నాణ్యతా పరీక్షలు ప్రారంభించిన్నట్లు చెప్పారు. నూతన పరీక్షల ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎండీ పి.గోపాళ్ళ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.


సంగం డెయిరీ నూతన ఉత్పత్తులను మార్కెట్‌లోకి ప్రవేశపెడ్తుతున్న సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తదితరులు

కోటప్పకొండ అభివృద్ధి, రోడ్ల నిర్మాణంపై అలసత్వం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి23: ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ అభివృద్ధి, అక్కడి రహదారి నిర్మాణం ప్రభుత్వానికి కనీసం గుర్తున్నాయా? అని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. కోటప్పకొండ తిరునాళ్ళకు సమయం దగ్గర పడుతున్నప్పటికీ పనులు నత్తనడకన సాగటం, రోడ్ల మరమ్మత్తులైతే ప్రారంభం కాకపోవటంపై విచారం వ్యక్తం చేశారు. త్రికోటేశ్వర స్వామి దేవాలయం రాష్ట్రంలోనే అత్యంత పురాతన ప్రసిద్ధ దేవాలయాల్లో ఒకటి అని, ఈ కోటప్పకొండ జాతరకు లక్షలాది మంది భక్తులు వస్తారని, అలాంటి చోట అభివృద్ధి, మౌలిక వసతులు ఎందుకు ఇంత అలసత్వం చేస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. కోటప్పకొండకు చేరుకోవటానికి నరసరావుపేట నుంచి రెండు, చిలకలూరిపేట ఒక దారి ఉన్నప్పటికీ అవేవి ప్రస్తుతం సరిగా లేవన్నారు. నియోజక వర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రభలు వస్తుంటాయని, కాని దారులన్నీ అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. ఆ దారుల్లో ప్రభలు ఎలా తీసుకు రావాలని? ప్రజలు పడుతున్న ఆందోళన గుర్తించి ఇకనైనా యుద్ధప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేయాలన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన కానిస్టేబుల్ సస్పెన్షన్

దాచేపల్లి, ఫిబ్రవరి 23: వివాహితను లైంగిక వేధింపులకు గురిచేసిన పోలీసు కానిస్టేబుల్‌ను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు శుక్రవారం దాచేపల్లి పోలీసులు తెలిపారు. దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వ్యక్తి తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని తనకు న్యాయం చేయాలని బాధితురాలు జిల్లా ఎస్పీ, గురజాల డీఎస్పీ, దాచేపల్లి సీఐలకు వినతిపత్రం అందజేసింది. బాధితురాలికి అండగా పలు ప్రజాసంఘాలు కూడా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాయి. గత ఐదు రోజుల క్రితం అధికారులు కానిస్టేబుల్‌ను వీఆర్‌కు తరలించగా ఈ రోజు సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు అందజేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

సీఎం సభకు బస్సులు రయ్.. రయ్..

● మళ్ళీ ప్రయాణికులకు కష్టాలు ● ప్రైవేటు వాహనాలతో జేబులకు చిల్లు

గుంటూరు, ఫిబ్రవరి 23: సీఎం సభ అంటేనే ఆర్టీసీ ప్రయాణీకులకు ప్రయాణ కష్టాలు తప్పటం లేదు. తప్పనిసరి ప్రయాణాలైతే ప్రైవేటు వాహనాల బాట పట్టి జేబులకు చిల్లు పెట్టుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. మొన్నటి కి మొన్న అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం సిద్ధం సభకు బస్సులు తరలించిన ఆర్టీసీ యాజమాన్యం తాజాగా శుక్రవారం ఒంగోలు సభకు తరలించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాపట్ల జిల్లాలోని చీరాల, అద్దంకి, బాపట్ల డిపోల నుంచి 55 బస్సులు, గుంటూరు జిల్లాలోని పొన్నూరు, గుంటూరు -1, 2 డిపోలతో పాటు తెనాలి, మంగళగిరి డిపోల నుంచి 97, పల్నాడు లోని చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి డిపోల నుంచి 88 సర్వీసులను సీఎం సభకు తరలించారు. ఒంగోలులో పేదలకు ఇళ్ళ పంపిణీకి సంబంధించి సీఎం సభకు జన సమీకరణకు జిల్లా నుంచి 240 బస్సులను తరలించారు. అలానే నెల్లూరు జోన్ నుంచి 240తో కలిపి ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి మొత్తం 500 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. సీఎం సభకు బస్సులు గురువారం సాయంత్రమే వెళ్ళిపోవటంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా పల్నాడు ప్రాంతంతో పాటు తెనాలి, విజయవాడ, పర్చూరు, అమరావతి రూట్లలో ప్రయాణీకులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆటోలు, టాటా మ్యాజిక్‌లు, కార్లు వంటి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి అదనపు ఛార్జీలతో గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వచ్చింది. ఇక మార్కెట్ సెంటర్‌లోని పల్నాడు బస్టాప్ వద్ద ప్రయాణీకులు బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చిందని వాపోతున్నారు.


ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణీకుల పడిగాపులు

బస్సులన్నీ ముఖ్యమంత్రి సభకు..

బాపట్ల, ఫిబ్రవరి 23: బాపట్ల ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్డినరీ బస్సులు 27 ఉండగా అందులో 20 బస్సులు ఒంగోలులో జరిగిన ముఖ్యమంత్రి సభకు శుక్రవారం మళ్లించారు. 7 సర్వీస్‌లే మిగిలి ఉండటం వల్ల అధికారులు అన్ని ప్రాంతాలకు నడపలేకపోయారు. దీనివల్ల ప్రయాణికులు రోడ్ల వెంట పడిగాపులు కాస్తూ నానా ఇబ్బందులు పడ్డారు. ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు అందుబాటులో ఉండవు. ఆర్డనరీలు ఈ విధంగా ముఖ్యమంత్రి సభలకు తరలించటం ఇబ్బందిగా ఉందని పలువురు ప్రయాణికులు పేర్కొంటున్నారు.

రెండు ఇళ్లలో భారీ చోరీ

వినుకొండటౌన్, ఫిబ్రవరి 23: సినిమా ఫక్కీలో దొంగలు రెక్కీ నిర్వహించి పెద్దమొత్తంలో బంగారం, నగదు దోచుకెళ్లిన ఘటన మండలంలోని పిట్టంబండ, గోనుగుంట్లవారిపాలెం గ్రామాల్లో జరిగింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే.. పిట్టంబండ గ్రామానికి చెందిన మక్కెన గంగాధర్ నివాసానికి తాళాలు వేసి ఉండగా బుధవారం అర్ధరాత్రి ఇంటికి వేసిన తాళాలను పగలగొట్టి ఇంట్లోని 19 సవర్ల బంగారు, 3కిలోల వెండి, రూ.2 లక్షలు దోచుకున్నారు. వీటితో పాటు దొంగిలించిన ఏటీఎం కార్డుతో రెండు ఏటీఎంలలో రూ80 వేలు డ్రా చేశారు. అదే రోజు రాత్రి గోనుగుంట్లవారిపాలెంలో దండు శ్రీనివాసరావు నివాసంలో 14 సవర్ల బంగారం, రూ.30 వేలు నగదు అపహరించారు. క్లూస్ టీమ్ గురువారం ఘటనా స్థలాల్లో వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ సాంబశివరావు తెలిపారు.


వినుకొండ ఎస్‌బీఐ ఏటీఎంలో తస్కరించిన ఏటీఎం కార్డు ద్వారా డబ్బు డ్రాచేస్తున్న అనుమానితులు

చేతబడి నెపంతోనే వ్యక్తి హత్య


దుండగులు తగలబెట్టిన మోటార్ బైక్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

ఈపూరు, ఫిబ్రవరి23: చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో గుర్తుతెలియని వ్యక్తులు తులసీ నాయక్(47)ను హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అగ్నిగుండాల సమీపంలో గురువారం తులసీనాయక్ హత్య జరిగిన విషయం విదితమే. సంఘటనా స్థలాన్ని నర్సరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, వినుకొండ సీఐ సాంబశివరావు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుంటూరు నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ వచ్చి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. బొల్లాపల్లి మండలం మాలపాడుకు చెందిన భూక్యా తులసీ నాయక్ గ్రామంలో పూజలు చేస్తూ ఆరోగ్యం బాగాలేని వారికి తాయిత్తులు వేస్తుంటాడు. గ్రామంలోని పొలాల్లో బోరులో నీరు రాకపోవడంతో ఈపూరు మండలం అగ్నిగుండాల సమీపంలో పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. తులసీనాయక్ బంధువు ఒకరు అనారోగ్యంతో మృతి చెందగా చేతబడి చేయడం వలనే చనిపోయాడని అనుమానం వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. తులసీ నాయక్‌ను హత్యచేసి అతని కుడిచేతి బొటన వేలు కోసుకొని వెళ్లారు. అంతేకాకుండా అతని మోటార్ బైక్‌ను తగలబెట్టారు. బొటనవ్రేలు కోసుకొని పోవడం చూస్తే ఇది కచ్చితంగా చేతబడి చేసినాడనే అనుమానంతో హత్యచేశారని అనుమానిస్తున్నారు. తులసీనాయక్ భార్య మాత్రం తన భర్తకు అమ్మవారు పూనకం వస్తుందని, అందువలన ఇంట్లో పూజలు చేస్తామని పోలీసులకు చెప్పింది. తులసీ నాయక్ మృతదేహానికి వినుకొండ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ ఎస్కే మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు.



డాక్టర్ కోడెల, సైదయ్య, ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

ప్రజల సొమ్ముతో సిద్ధం సభలు నిర్వహిస్తున్న సీఎం జగన్

- నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, ఫిబ్రవరి 23 : ప్రజల సొమ్ముతో సిద్ధం సభలను వందల కోట్లతో నిర్వహించటం జగన్ అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. నకరికల్లు మండలం కండ్లకుంట గ్రామంలో శుక్రవారం రాత్రి బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య అధ్యక్షతన జరిగిన సభలో కన్నా మాట్లాడుతూ మద్యం, ఇసుక, మైనింగ్, కాంట్రాక్ట్‌ల పేరుతో దొంగల ముఠా నాయకుడిగా జగన్ మారాడన్నారు. కోడెల, చంద్రబాబు నాయుడు నకరికల్లులో ఏర్పాటు చేసిన గోదావరి-పెన్నా నదుల అనుసంధానం పైలాన్‌ను టీడీపీ అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టును సాకారం చేసి సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతాంగానికి సాగు, తాగునీటిని అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి, రావెల సత్యనారాయణ, రావెల లింగయ్య, పమిడి రామయ్య, కండ్లకుంట శ్రీనివాసరావు, పాలడుగు శ్రీనివాసరావు, యాళ్ళ శ్రీనివాస శేష సాయి బాబా, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు, భీమినేని వందనాదేవి, పెమ్మసాని బ్రహ్మయ్య, కోడెల అబ్బయ్య, డాక్టర్ పాలడుగు లక్ష్మీనారాయణ, జంపని వెంకటరావు, గాడిపర్తి వెంకయ్య, ఎండ్లూరి శ్రీనివాసరావు, గాలి సతీష్, పాలడుగు పుల్లారావు, ఏడుకొండలు, రావెల శాయి నవీన్ కుమార్, పెమ్మసాని బ్రహ్మయ్య, కన్నా నాగరాజు, పూజల వెంకట కోటయ్య, నాదెండ్ల సత్యనారాయణ, గంగవరపు విశ్వేశ్వరరావు, చట్టు నాగేశ్వరరావు, గంగవరపు కొండయ్య, గొల్లపాటి కొండలరావు, గర్నెపూడి ఆనందరావు తదితరులు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

సత్తెనపల్లి, ఫిబ్రవరి 23 : మండలంలోని భీమవరంనకు చెందిన వైసీపీ నాయకులు దామచర్ల శ్రీనివాసరావు, ఏడుకొండలు, దామచర్ల శ్రీనివాసరావు, మన్నెం తరుణ్, పాపినేని విజయ్‌లు శుక్రవారం పట్టణంలోని రఘురామ్ నగర్‌లో కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కన్నా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజక వర్గ పరిశీలకులు తాత జయప్రకాష్ నారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, నాయకులు కట్టా రమేష్, తొరటి వెంకటరావు పాల్గొన్నారు.

● రాజుపాలెం, ఫిబ్రవరి 23 : గణపవరం గ్రామానికి చెందిన ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 10 కుటుంబాల వారు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి టీడీపీ సత్తెనపల్లి నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రేపటి ప్రజాప్రభుత్వంలో దళితుల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి వుందని కన్నా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ నర్రా బాబురావు, మండల పార్టీ కన్వీనర్ పల్లపాటి పెద్దిరాజు, గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాడ్గే బాబాకు ఘన నివాళి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 23: ప్రఖ్యాతుడైన సంఘ సంస్కర్త, సంచార భిక్షువు సంత్ గాడ్గే బాబా మహరాజ్ జయంతిని పురస్కరించుకొని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ సంస్కర్త, కులనిర్మూలన, విద్యాదానం, స్వచ్ఛత ఉద్యమం, పరిశుభ్రత, అంటరానితనం నిర్మూలనపై సంత్ గాడ్గే బాబా ఎంతో కృషి చేశారని యరపతినేని తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కినపల్లి బాలయ్య, మక్కెన రాజు, పాదర్తి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల విద్యుత్ బకాయిలు చెల్లించాలి

మాచవరం, ఫిబ్రవరి 23: మాచవరం మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు సంబంధించిన విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలంటూ శుక్రవారం ఎంపీడీవో సురేష్‌కు విద్యుత్ శాఖ అధికారులు నోటీసులు అందజేశారు. మండలం మొత్తం మీద రూ.6,32,54,785 బకాయి వున్నట్లు అధికారులు ఎంపీడీవో దృష్టికి తీసుకొచ్చారు. మాచవరంలో 22 సర్వీసులకు గాను 55 లక్షల 16 వేల 561 రూపాయలు, అలాగే వివిధ గ్రామాలకు సంబంధించి విద్యుత్ బకాయిలు చెల్లించాలంటూ ఎంపీడీవోకు నోటీసులు అందజేశారు. నోటీసులు అందజేసిన వారిలో దాచేపల్లి సెక్షన్ అధికారులు, ఎఇ పెదమస్తాన్, తదితరులున్నారు.

పది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

దాచేపల్లి, ఫిబ్రవరి 23 : పదవ తరగతి విద్యార్థుల పరీక్షలకు సంబంధించిన సామగ్రిని దాచేపల్లి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు శుక్రవారం అందజేశారు. నడికూడి గ్రామ మాజీ సర్పంచ్ బుర్రి విజయకుమార్‌రెడ్డి, గొట్టం ఆంజనేయులురెడ్డిలు విద్యార్థులకు పరీక్షల ప్యాడ్స్, జామెంట్రీ బాక్స్, పెన్నులను 200 మంది విద్యార్థులకు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కందులకు మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వం : ఏవో

కారంపూడి, ఫిబ్రవరి 23 : ప్రభుత్వం కందులకు మద్దతు ధర ప్రకటించిందని ఏవో యలమందారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వం కందులు క్వింటా ధర రూ.9750కు కొనుగోలు చేస్తోందన్నారు. కూలీలకు ట్రాన్స్‌పోర్టు ఖర్చు పోనూ రూ.9680 రైతుకు అందిస్తామన్నారు. నాఫెడ్ ద్వారా గోతాలను సరఫరా చేస్తున్నామన్నారు. మండలంలోని చినగార్లపాడులో 60 క్వింటాళ్లు కొనుగోలు చేశామన్నారు. మిర్యాల, నరమాలపాడు, పేటసన్నిగండ్ల, చినకొదమగుండ్ల, చింతపల్లి, గాదెవారిపల్లె గ్రామాల్లో కందుల కొనుగోలుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా కందుల శాంపిల్స్ ఇస్తే నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాలకు నగదు జమ అవుతుందన్నారు.

టీడీపీతోనే దళితుల సంక్షేమం : యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 23 : దళితుల సంక్షేమాన్ని మరిచి గతంలో కొనసాగుతున్న అనేక పథకాలను రద్దు చేసి వారి అభివృద్ధిని పూర్తిగా కుంటుపడేలా చేసిన అధికార పార్టీకి ఎస్సీల సత్తా చూపే సమయం ఆసన్నమైందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎస్సీ మాల సామాజికవర్గానికి చెందిన వారితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో ముఖ్యులు ఆత్మీయ సమావేశానికి హాజరుకాగా, యరపతినేని మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి విదేశీ విద్యను అందకుండా చేయడంతో పాటు ఎన్టీ రామారావు ప్రవేశపెట్టిన అనేక పథకాలను ఎస్సీ సామాజికవర్గానికి దూరం చేస్తున్న వైసీపీని గద్దె దించేందుకు సిద్ధంగా వుండాలన్నారు. సమావేశంలో యరపతినేని తనయుడు నిఖిల్, డాక్టర్ వరలక్ష్మీ, పణితి రవి, పిల్లి చెన్నారావు, నాగేశ్వరరావు, అనిల్, కృష్ణ, కంచర్ల రాజు, కాశిమళ్ల శౌరిబాబు, గురజాల శ్యామ్, ఐతం పెదమాణిక్యరావు, దేవదానం, పణితి కాంతారావు, ముంద్ర రాంబాబు, పోతుల సీతయ్య, పణితి అరవింద్, యరమాల నాగేశ్వరరావు, పప్పుల ఏసయ్య, గెల్లా బాబు, మరికంటి రమేష్, మోటమర్రి శ్రీను, పత్తిపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన ఆర్యవైశ్య సామాజికవర్గ నేతలతో యరపతినేని

టీడీపీలో చేరిన పిడుగురాళ్ల ఆర్యవైశ్యులు

పట్టణంలోని ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి శుక్రవారం టీడీపీలో చేరారు. రాష్ట్రంలో వైసీపీ పాలన అధికారంలోకి వచ్చాక ఆర్యవైశ్యుల సామాజికవర్గాలకు భద్రత కరువైందని, ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని పలుమార్లు తెలియజేసినప్పటికీ పట్టించుకోకపోగా మరీ ఆక్రమణల పర్వం, బెదిరింపులు ఎక్కువవడంతో విసుగు చెంది వైసీపీ నుంచి టీడీపీలో చేరడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు, యరపతినేని తనయుడు నిఖిల్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేతులమీదుగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గోపవరపు వెంకటేశ్వర్లు, తడికమళ్ల విజయ్, ఆలేటి గంగాధర్, కొత్త పాండు రంగారావు, కాకుమాను అజయ్‌కుమార్, చిట్టిప్రోలు కిషోర్, యక్కల సాంబశివరావు, కూరపాటి నాగేశ్వరరావు, త్రిపురమల్లు అనిల్‌కుమార్, కటకం సురేష్, కొప్పురావూరి అమర్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో పాండురంగ శ్రీను, కోట హరి, సేగు రమేష్, ఎస్ఆర్ఎంటి సుబ్బారావు, వల్లంబొట్ల నాగేశ్వరరావు, వందనపు రవి, గోళ్ల కిరణ్, పలుచూరి ధనుంజయ, కొత్త పాండురంగారావు, మోదడుగు హరినాథబాబు, బూరెల అనిల్‌కుమార్, నీరుమళ్ల సత్యనారాయణ, భవిరిశెట్టి రాజా, మోటమర్రి శ్రీను తదితర నేతలు పాల్గొన్నారు.

మూడవ రోజూ బ్రాహ్మణపల్లిలో బాబు ష్యూరిటీ సక్సెస్

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 23 : అధికార పార్టీ వేధింపులు, జరగని అభివృద్ధిపై విసుగు చెందిన గ్రామస్తులు ఒక్కొక్కరుగా టీడీపీకి చేరువ అవుతున్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో మూడు రోజులుగా యరపతినేని శ్రీనివాసరావు నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం సక్సెస్ అయింది. ప్రతి కాలనీలోని ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం అధికారంలో వున్నప్పుడు జరిగిన అభివృద్ధితో పాటు ఆయా సామాజికవర్గాలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలకు జరిగిన లబ్ధిని యరపతినేని వివరిస్తూనే రేపటి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికి చేకూరబోయే లబ్ధిని వివరిస్తూ భవిష్యత్‌కు గ్యారంటీ కార్డులను అందజేశారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో కూడా యరపతినేని వీధుల్లోకి వస్తుండగా మహిళలు ఎదురేగి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, మేకల సాంబశివరావు, మాజీ ఎంపీపీ యడ్లపల్లి నారాయణ, మేకల రాంబాబు, యక్కల సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు మామిళ్ల శివ, యూత్ నాయకులు అనిల్, మహిళా అధ్యక్షురాలు పర్సూరి వెంకట రమణ, పాదర్తి రాజేశ్వరి, తిరుపతయ్య, బుచ్చయ్య, శివయ్య, హనుమయ్య, మురళీ, రామకృష్ణ, అంజి, ఆది, బీసిపోగు శ్రీను, సెంట్రింగ్ కోటి, చక్రం శ్రీను, బూత్ కన్వీనర్లు జిలాని, హసన్, గురవయ్య, ప్రసన్న, రాజశేఖర్, గురువర్ధన్, నాగార్జున, సంకుల శ్రీను, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, గోపయ్య, ఆర్‌టిఎ సైదా, కెఎస్ఎన్ సైదా, బ్యాటరీ వలి, ఆటో నాగులు పాల్గొన్నారు.

శివరాత్రికి 54 ప్రత్యేక బస్సు సర్వీసులు : ఆర్టీసీ డీఎం

రెంటచింతల, ఫిబ్రవరి 23 : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మార్చి 8న ఆయా పుణ్యక్షేత్రాలకు భక్తులను తరలించేందుకు 54 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ పిచ్చయ్య చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీశైలంకు 16, సత్రశాల 32, ద్రైద 3, మన్నేపల్లి 2, తేరాల 1. కాగా మార్చి 7, 8, 9 తేదీల్లో సాగరమాత ఉత్సవాలకు సంబంధించి 25 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

సమావేశానికి రమ్మని డుమ్మా కొట్టిన అధికారులు

గురజాలటౌన్, ఫిబ్రవరి 23: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి ఆధ్వర్యాన ఉదయం 10:30 గంటలకు సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నామని, హాజరుకావాలని నేతలకు మెసేజ్‌లు పంపారు. దీంతో రాజకీయ పార్టీల నేతలు నిర్ణీత సమయానికి వచ్చారు. టీడీపీ నేతలు ఆర్డీవో రావడం లేదా అని కిందిస్థాయి సిబ్బందిని ప్రశ్నించారు. ఆర్డీవో వివిధ పనులపై కలెక్టర్ కార్యాలయానికి వెళ్తున్నారని వారు సమాధానమిచ్చారు. ఆర్డీవోకు సమస్యలను విన్నవించాలని వచ్చామని, ఆర్డీవో లేకుంటే ఎవరికి చెప్పుకోవాలంటూ అసహనం వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి టీడీపీ నేతలు వెనుదిరిగి వెళ్లారు.

వాటర్ పైపులైను పనులు పరిశీలించిన కమిషనర్

మాచర్ల, ఫిబ్రవరి 23: పట్టణంలో రూ. 40 లక్షలతో జరుగుతున్న వాటర్ పైపులైను పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు పరిశీలించారు. రింగు రోడ్డు నుంచి శ్రీశైలం రహదారి మీదుగా అర్బన్ హెల్త్ సెంటర్ వైపునకు ఏర్పాటు చేస్తున్న పైపులైను పనులను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. ఈ పైపులైను పనులు పూర్తయితే రహదారికి అనుసంధానంగా ఉన్న వీధులతోపాటు రైలుకట్ట, ఎర్రగడ్డ ప్రాంతాలకు నీరు అందుతుందన్నారు. కమిషనర్ వెంట డీఈ మధుసూదనరావు, ఏఈ ఆదిత్య, సిబ్బంది ఉన్నారు.



పైపులైను పనులు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటదాసు

మల్లవరంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు?

రెంటచింతల, ఫిబ్రవరి 23 : కృష్ణానదికి సమీపంలోని మల్లవరం గ్రామానికి పడమర వైపున ఆంజనేయస్వామి ఆలయానికి సమీపంలో గురువారం అర్ధరాత్రి గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. ఈ తవ్వకాల్లో ఏమి దొరకగపోగా పోలీసులు వస్తున్నారనే సమాచారంతో పరారైనట్లు తెలిసింది.

పంచాయతీ పన్నులపై అవగాహన

రాజుపాలెం, ఫిబ్రవరి 23: ఇంటి, దుకాణ పన్ను చెల్లింపులపై ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకోవాలని జిల్లా డీఎల్‌పీవో డాక్టర్ పి.రమణయ్య తెలిపారు. శుక్రవారం రాజుపాలెం పంచాయతీ కార్యాలయంలో ఈవోపీఆర్డీ ముక్కంటి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు ఇంటిపన్ను వసూళ్లపై అవగాహన కల్పించారు. ఇంటి పన్నుల వసూళ్లలో రాజుపాలెం అధమస్థానంలో ఉందని, ఇప్పటి వరకు 20 శాతం ఇంటిపన్ను వసూలు చేశారని, మార్చి 25 నాటికి 100 శాతం పూర్తి చేయాలని, అలా చేయని కార్యదర్శులపై చర్యలు తీసుకోనున్నట్టు డాక్టర్ రమణయ్య తెలిపారు.

నేడు యరపతినేని గురజాలకు రాక

గురజాలటౌన్, ఫిబ్రవరి 23 : గురజాల మండలంలో శనివారం మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పర్యటించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని గంగవరంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో యరపతినేని పాల్గొంటారన్నారు. మండలంలోని టీడీపీ, జనసేన నేతలు, అధికారులు పాల్గొనాలని కోరారు.

వైసీపీ నేత ద్విచక్ర వాహనం దహనం

కారంపూడి, ఫిబ్రవరి 23 : కారంపూడికి చెందిన వైసీపీ నేత చింతల శ్రీనివాసరావు ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి దహనం చేశారు. శ్రీనివాసరావు గురువారం రాత్రి తన ఇంటి ముందుకు బైకును పార్కు చేశారు. అర్ధరాత్రి సమయంలో ఇంటి పక్కన వ్యక్తి బైకు దగ్ధం అవుతుండడాన్ని గమనించి శ్రీనివాసరావుకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. శ్రీనివాసరావు ఇంటి నుంచి బయటకు వచ్చి చూసేసరికి బైకు దగ్ధమైంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు అధికారిగా శంకరరావు

రెంటచింతల, ఫిబ్రవరి 23 : త్వరలో జరగనున్న లోకసభ, రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికలకు సంబంధించి ప్రవర్తనా నియమావళి అమలు అధికారిగా ఎంపీడీవో పెదప్రోలు శంకరరావును నియమిస్తూ కలెక్టర్ ఎల్.శివశంకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అంబటి ప్రత్యక్ష రాజకీయాలకు పనికి రారు : టీడీపీ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 23 : మంత్రి అంబటి రాంబాబు ప్రత్యక్ష రాజకీయాలకు పనికి రాడని 2004లోనే వైఎస్ రాజశేఖరరెడ్డి సీటు ఇవ్వలేదని టీడీపీ నేతలు అన్నారు. ప్రజా వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గాలి వాటాన 30 సంవత్సరాలకు రెండోసారి గెలిచిన అంబటి వైఎస్ జగన్ కాళ్ళు యాళ్ళ పడి మంత్రి అయ్యాడన్నారు. పోలవరం ప్రాజెక్టు గురించి కనీస జ్ఞానం లేదన్నారు. రోడ్ల వెంట డాన్స్‌లు వేసుకొనే మంత్రికి రైతులు, ప్రజా సమస్యలు పట్టవన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలు అంబటి రాంబాబును తరిమి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ నేతలు కంభాల వెంకటేశ్వరరావు, రాంబో బుడే, షేక్ మాబూ సుభానీ, మాబు, రాయుడు శ్రీనివాసరావు, మజీద్ ఉన్నారు.

పలువురిని పరామర్శించిన కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 23 : మండలంలోని ధూళిపాళ్ళ గ్రామానికి చెందిన టీడీపీ నేతలు బండారపల్లి వెంకయ్య, బండారుపల్లి ప్రసాదరావు, నాదెండ్ల సాంబయ్యలను, వారి కుటుంబ సభ్యులను టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం కలసి పరామర్శించారు. ఆయనతో పాటు టీడీపీ నేతలు ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల వెంకటస్వామి, ఆళ్ళ సాంబయ్య, లింగిశెట్టి సూరిబాబు, బండారుపల్లి వెంకట అప్పయ్య, భైరపు తిరుపతిరావు, బద్దుల హనుమంతరావు, కంచేటి ముని, కొండ్రగుంట రంగారావు, చిమటా శ్రీను, కట్టా రమేష్, పల్లపాటి పెద్దిరాజు, బద్దుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 31వ వార్డులో ఇటీవల మరణించిన పసుపులేటి నాగరాజు గృహానికి కన్నా లక్ష్మీనారాయణ వెళ్ళి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగరాజు చిత్రపటానికి వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మేరీగ్రేస్, టీడీపీ పట్టణ కార్యదర్శి నూర్ బాషా జానీ బాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు

సత్తెనపల్లి పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానంలో జరిగిన అమ్మవారి కల్యాణ మహోత్సవంలో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నాన్ని వడ్డించారు.

కోటి కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 23 : పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో ఉన్న శివాలయంలో జరిగిన కోటి కుంకుమార్చనలో 200 మంది మహిళా భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. లలిత సంఘం ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. పూజా కార్యక్రమాలకు కారకులైన కటకం కోటి సుబ్బారావును భక్తులు ఘనంగా సన్మానించారు. శనివారం కూడా కోటి కుంకుమార్చన జరుగుతుందని భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జవ్వాజి లక్ష్మీ, పీ.నాగ కన్యకుమారి, కోట నాగ వరలక్ష్మీ, రంగా రమాదేవి, దవ్వెల శ్రీను, కటకం బాబు, జవ్వాజి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కాపు కార్పొరేషన్ డైరక్టర్‌గా మంగిశెట్టి

అమరావతి, ఫిబ్రవరి 23: రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరక్టర్‌గా అమరావతికి చెందిన మంగిశెట్టి కోటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో డైరక్టర్‌గా ఉన్న లీలా వెంకట్రావు తన పదవికి రాజీనామా చేయడంతో కోటేశ్వరరావును నియమించారు. కోటేశ్వరరావుకు పలువురు వైసీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

నేడు పెదకూరపాడులో జనసేన కార్యాలయం ప్రారంభం

పెదకూరపాడు, ఫిబ్రవరి 23 : పెదకూరపాడులో శనివారం జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు మల్లెల వెంకట చలపతిరావు శుక్రవారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ప్రారంభిస్తారని, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సుభాని

సత్తెనపల్లి, ఫిబ్రవరి 23 : ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎస్ఎం సుభాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఎంపికపై ఎస్టీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నిరుపేద విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

క్రోసూరు, ఫిబ్రవరి 23 : మాగులూరి ఫౌండేషన్ ద్వారా మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన నిరు పేద విద్యార్థికి శుక్రవారం ల్యాప్‌టాప్ అందజేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు కంచేటి సాయిబాబు చేతుల మీదుగా బీటెక్ ఫైనలియర్ చదువుతున్న ఇమామ్ బాషాకు సుమారు రూ 60వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను అందించారు. కార్యక్రమంలో మాగులూరి ఫౌండేషన్ చైర్మన్ భానుప్రకాష్, క్రోసూరు మాజీ వైస్ ప్రెసిడెంట్ షేక్ ముస్తఫా, ఫౌండేషన్ ప్రతినిధులు ప్రసాదు, కిరణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

దాచేపల్లి, ఫిబ్రవరి 23: దాచేపల్లిలోని శ్రీ లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్థప్రసాదాలు అందజేశారు.

●పెదకూరపాడు, ఫిబ్రవరి 23 : మండలంలోని 75 తాళ్ళూరులో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి కళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకు న్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

టీడీపీ అంటేనే బీసీల పార్టీ : కొమ్మాలపాటి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, ఫిబ్రవరి 23 : తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ అని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ముఖ్య నేతలతో కలసి ఆయన మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా అవకాశం కల్పించిన పార్టీ టీడీపీ అని, మీ స్వార్థ రాజకీయాల కోసం కులాల కుంపట్లు పెట్టి పబ్బం గడుపుకొనే కుసంస్కారం వైసీపీ పేటీఎం బ్యాచ్‌దని, టీడీపీ ఎప్పుడూ ఇటువంటి నీచ రాజకీయాలకు పాల్పడదన్నారు. బీసీల పట్ల అపారమైన గౌరవం వైఎస్ జగన్‌కు ఉందని చెపుతున్న అనిల్ కుమార్ ఇదే పార్లమెంట్ నియోజకవర్గంలో జంగా కృష్ణమూర్తి బీసీ కాదా? ఆయనను ఏ మాత్రం గౌరవించారో చెప్పాలన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని, బీసీల గురించి మాట్లాడే అర్హత, హక్కు గాని మీకు లేదని శ్రీధర్ అన్నారు.

సాగునీటి కోసం తాగునీరు నిలిపేశారు

- కృష్ణానది ప్రవాహానికి అడ్డుగా కట్ట
- అమరావతి పరిసర గ్రామాలకు అందని తాగునీరు



నీటి ప్రవాహానికి అడ్డుగా కట్టవేసిన చిత్రం

అమరావతి, ఫిబ్రవరి 23 : కృష్ణానదిలో ఎగువ నుంచి వస్తున్న అరకొర నీటిని దిగువకు వెళ్లకుండా అడ్డుకట్ట వేసి ఆ నీటిని తమ ఎత్తిపోతల పథకానికి విని యోగించుకుంటున్న సంఘటన మండల పరిధిలోని దిడుగు ఎత్తిపోతల పథకం వద్ద జరుగుతుంది. నది ఒడ్డు నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర నదీ ప్రవాహానికి అడ్డుకట్ట వేసి కాలువ ద్వారా ఆ నీటిని పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. దీంతో దిగువన ఉన్న ముత్తాయపాలెం, ధరణికోట ఎత్తిపోతల పథకాలకి, అమరావతి వద్ద ఉన్న వైకుంఠపురం పైలట్ పథకానికి నీరు అందక పోవడంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకుంది. అమరావతి పైలెట్ పథకం ద్వారా అమరావతి, ధరణికోట, లింగాపురం తదితర గ్రామాలకు తాగునీరు సరఫరా కావాల్సి ఉండగా నాలుగు రోజుల నుంచి మోటర్లకు నీరు అందకపోవడంతో తాగునీటి కోసం ఆయా గ్రామప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. అధికారులు వెంటనే అడ్డుకట్టను తొలగించి దిగువున ఉన్న గ్రామాలకు తాగునీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

వెతికేకొద్ది ఓటరు లిస్టులో డబుల్ ఎంట్రీలు

అమరావతి, ఫిబ్రవరి 23 : నియోజకవర్గ ఎన్నికల అధికారులు ఓటర్ల లిస్టులో ఉన్న తప్పులను సరిచేయాలని ఆదేశించినప్పటికి మండల పరిధిలోని అత్తలూరు గ్రామంలోని ఓటర్ల లిస్టులో వెతికే కొద్ది డబుల్ ఎంట్రీలు కనిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన కుంభా శ్రీలక్ష్మికి 236, 237 నెంబర్లలో ఓటు ఉంది. కూచిపూడి శ్యామ్‌బాబుకు 142, 143 నెంబర్లలో, నెట్టం మధుశ్రీధర్‌కు 41, 1100 నెంబర్లతో ఓట్లు ఉన్నాయి. ఇదేవిధంగా అత్తలూరులో నివాసం ఉండని నల్లమోతు చైతన్య, గౌతు సికిందర్‌కు 206 బూత్‌లో ఓట్లు ఉండగా అచ్చంపేట మండలం పెదపాలెంలో కూడా ఓట్లు ఉన్నాయి. కుంభా నరసింహరావు, కుంభా సువార్తకు అత్తలూరులో 205 బూత్‌లో ఓట్లు ఉండగా వీరికి క్రోసూరు మండలం ఎర్రబాలెంలో 121వ బూత్‌లో ఓట్లు ఉన్నాయి. వేముల చిన్నమ్మ, మేముల శ్రీనివాసరావు, వేముల రమణ, తమ్మిశెట్టి శివమ్మకు నరసరావుపేట నియోజకవర్గంలోని పాలపాడులో ఓట్లు ఉండగా వీరికి అత్తలూరులో ఓట్లు ఉన్నాయి. ఈ విధంగా పరిశీలిస్తూపోతే అనేక లోపాలు ఓటరు లిస్టులో బయటపడుతున్నాయి. డబుల్ ఎంట్రీలన్నీ అధికార పార్టీకి చెందినవిగా స్థానిక టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

శాలివాహన సాధికారిక కమిటీ కన్వీనర్‌గా ఆరేపల్లి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 23 : నరసరావుపేట పార్లమెంట్ శాలివాహన సాధికార సమితి కన్వీనర్‌గా సత్తెనపల్లికి చెందిన ఆరేపల్లి ఏడుకొండలను నియమిస్తూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆంజనేయులు చేతుల మీదుగా శుక్రవారం ఆరేపల్లి ఏడుకొండలు ఉత్తర్వులు అందుకున్నారు. ఏడుకొండలు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో శాలివాహన సంఘం ద్వారా పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.

విద్యార్థులకు నిర్దిష్టమైన లక్ష్యం ఉండాలి : ఎస్ఐ

పెదకూరపాడు, ఫిబ్రవరి 23 : విద్యార్థులకు నిర్దిష్టమైన లక్ష్యం ఉండాలని, అప్పుడే ఉన్నత స్థితికి చేరుకోవచ్చని ఎస్ఐ విప్పర్ల వెంకటరావు అన్నారు. మండలంలోని గారపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జన చైతన్య సమితి సహకారంతో పరీక్షా సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కంకణాల స్వర్ణ కుమారి శివాజీ, విద్యాకమిటీ చైర్మన్ కొండమీద వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సీహెచ్ వెంకటేశ్వర్లు, జన చైతన్య సమితి కార్యదర్శి అన్నవరపు స్టాలిన్ బాబు, కో-ఆర్డినేటర్ వెలితోటి అనీల్ కుమార్, ఉపాధ్యాయులు కే.బ్రహ్మయ్య, పీ సురేష్‌లు పాల్గొన్నారు.

బీసీల ద్రోహిగా చరిత్ర పుటల్లో నిలిచి పోనున్న జగన్

- టీడీపీ బీసీ సెల్ నాయకుల విమర్శ

క్రోసూరు, ఫిబ్రవరి 23 : బీసీలకు తీరని ద్రోహం చేసిన వ్యక్తిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోనున్నారని పెదకూరపాడు నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నాయకులు విమర్శించారు. క్రోసూరు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా వైసీపీ ప్రకటించిన అనీల్ కుమార్ యాదవ్ సొంత జిల్లాలో చెల్లక కంటి తుడుపు చర్యగా మాత్రమే ఇక్కడ పోటీ చేస్తున్నారని, ఆయన ఓటమి ఖాయమన్నారు. వెనుకబడిన కులాల వారు ఎవరూ జగన్ మోహన్‌రెడ్డిని నమ్మే పరిస్థితి లేదన్నారు. విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు నల్లమేకల వెంకటేశ్వర్లు, బీసీ సెల్ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కూకట్లపల్లి వీరాంజనేయులు, పెదకూరపాడు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు తోక వెంకటరావు, బీసీ సెల్ నాయకులు పరిశ హనుమంతరావు, బొంతా హనుమంతరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కుంభా శ్రీనివాసరావు, టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు నాగుల్ షరీఫ్, టీడీపీ నాయకులు మన్నెం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

తొండపిలో టీడీపీ జెండా తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులు



టీడీపీ జెండా కట్ చేసి తీసుకెళ్ళగా మిగిలిన దిమ్మె

ముప్పాళ్ళ ఫిబ్రవరి 23: మండలంలోని తొండపిలో టీడీపీ జెండాను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి తీసుకెళ్ళడం వివాదాస్పదంగా మారింది. ఇటీవల గ్రామంలో టీడీపీ సత్తెనపల్లి నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొనగా వైసీపీ నాయకులు రాళ్ళ దాడి చేశారు. ఈ సంఘటనతో ఇప్పటికీ గ్రామంలో పోలీసు పికెటింగ్ నడుస్తూనే ఉంది. అయినా రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు టీడీపీ జెండాను కట్ చేసి తీసుకెళ్లారు. గ్రామంలో వివాదాలను పెంచేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ హజరతయ్యను వివరణ కోరగా టీడీపీ జెండా కట్ చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని, ఎటువంటి ఫిర్యాదులు అందలేదన్నారు.

లంకెలకూరపాడులో జెండాపెట్టకుండా అడ్డగింత

మండలంలోని లంకెలకూరపాడులో తమ సొంత స్థలంలో టీడీపీ జెండా ఏర్పాటును పోలీసులు అడ్డుకున్నారని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం తెలిపారు. గతంలో అదే స్థలంలో టీడీపీ జెండా ఉండేదని, గృహ నిర్మాణం చేసుకుండా తామే తీసి పక్కన పెట్టామని వారు తెలిపారు. తిరిగి మరలా జెండాను పెట్టేందుకు దిమ్మెను నిర్మిస్తుండగా వైసీపీ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు వచ్చి అడ్డుకున్నారని తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ హజరతయ్యను వివరణ కోరగా పంచాయతీ రోడ్డుపై టీడీపీ జెండాను ఏర్పాటు చేస్తున్నారని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు వచ్చి ఆపామని, వారి సొంత స్థలమా కాదా అని విచారణ చేస్తున్నామని తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వలంటీర్‌పై పోక్సోచట్టం కింద కేసు నమోదు చేయాలి

● ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 23: మండలంలోని పాలపాడు గ్రామానికి చెందిన బాలికను వేధింపులకు గురిచేసిన గ్రామ వలంటీర్ పిట్టు శ్రీకాంత్‌రెడ్డిపై పోక్సో చట్టంకింద కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పీడీఎం నాయకులు శుక్రవారం వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ వలంటీర్ పిట్టు శ్రీకాంత్‌రెడ్డి బాలికను వేధించడం వల్లే బాలిక బుధవారం ఆత్మహత్యాయత్నం చేసి ప్రాణాపాయస్థితిలో ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, కోటానాయక్, జక్కా బ్రహ్మయ్య, షేక్ మస్తాన్‌వలి, కంబాల ఏడుకొండలు, శిఖినం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభలకు ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికులకు ఇక్కట్లు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 23: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభలతో ఆర్టీసీ బస్సులను వినియోగిస్తుండటంతో ప్రయాణికులు ఇక్కట్లుపడుతున్నారు. వినుకొండ ఆర్టీసీ నుంచి గతంలో అనంతపురం జిల్లా రాప్తాడుకు 40బస్సులు తరలించగా, దెందులూరుకు 26బస్సులు, శుక్రవారం ఒంగోలులో జరిగిన సీఎం ప్లాట్ల పంపిణీ కార్యక్రమానికి 24బస్సులు వెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. డిపోలో 60 బస్సుల్లో నాణ్యమైన బస్సులను సభలకు తరలించగా డొక్కు బస్సుల ద్వారా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చడానికి సిబ్బంది తలలు పట్టుకున్నారు. ఇదిలా ఉండగా మార్చి 3వ తేదీన చిలకలూరిపేట వద్ద జరిగే సీఎం సభకు ముందుగా 50బస్సులను అడ్వాన్స్‌బుక్ చేసినట్లు సమాచారం.



నరసరావుపేట మండలం చినతురకపాలెం నాయకులతో డాక్టర్ చదలవాడ అరవిందబాబు

టీడీపీకి పూర్వ వైభవమే లక్ష్యంగా పనిచేయాలి

● కార్యకర్తలతో డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 23: రాష్ట్ర భవిష్యత్తు కోసం మన బిడ్డల భవిష్యత్తు కోసం రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో టీడీపీకి పూర్వ వైభవం తెచ్చేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు పిలుపినిచ్చారు. నరసరావుపేట మండలం చినతురకపాలెం గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపుకోసం కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కడియాల రమేష్, పులిమి రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో వైద్యం, విద్యకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోగల వైసీపీ కార్యాలయంలో 20మంది లబ్ధిదారులకు రూ.21.40 లక్షల విలువగల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

విజేతలకు తపాలాశాఖ బహుమతులు అందజేత

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 23: తపాలా శాఖ ఆధ్వర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన డిజిటల్ ఇండియా ఫర్ న్యూఇండియా అనే అంశంపై పోటీలు నిర్వహించారు. మొత్తం 6100మంది ఈ పోటీల్లో పాల్గొనగా నరసరావుపేట సర్కిల్ పరిధిలో నలుగురు పోటీలలో గెలుపొందారు. ఎస్‌కే అయేషా బేగం, శ్రీచైతన్య కాలేజ్ ప్రథమ బహుమతి, రూ.25000/-, ఎం.లిఖిత, నరసరావుపేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ద్వితీయ బహుమతి రూ.15,000/-, కె ప్రవంతి, నరసరావుపేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తృతీయ బహుమతి రూ.5000/-, ఎస్‌వీ సీతారామయ్య, నరసరావుపేట నాలుగవ బహుమతి రూ.2500/- బహుమతులు సాధించారు. విజేతలకు సూపరిండెంట్ ఆఫ్ హెడ్ పోస్టాఫీసర్ వి.వెంకటస్వామి బహుమతులను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 23: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గల విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నెంబరు 8 పరిధిలోని రైల్వే స్టేషన్‌రోడ్డు, బ్యాంకు స్ట్రీట్, పాత చెక్‌పోస్టు, రామిరెడ్డిపేట, అన్నపూర్ణమ్మ హాస్పటల్, వరవకట్ట, శ్రీరాంపురం తదితర ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

ఎస్పీని కలసిన మొదటి పట్టణ ఎస్ఐ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 23: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నరసరావుపేట మొదటి పట్టణ ఎస్ఐగా బదిలీ అయి బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ మణికృష్ణ శుక్రవారం జిల్లా ఎస్పీ రవి శంకరరెడ్డిని కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలన్నారు.

మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా శనగల కొనుగోలు

నరసరావుపేట అర్బన్, ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్, జాతీయ సంస్థ ఐన నాఫెడ్ ద్వారా శనగలు కొనుగోలు చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాదు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 - 24 సంవత్సరానికి రబీలో శనగలు సాగుచేసి ఈకేవైసీ చేయించుకున్న రైతులు ఈ నెల 28వ తేదీ తరువాత తమ పేర్లను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. క్వింటా ఒక్కింటికి రూ.5440 అని తెలిపారు.

టీడీపీ హయాంలోనే రికార్డు స్థాయిలో గృహ నిర్మాణాలు

○ మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



గృహ నిర్మాణాలపై ప్రభుత్వానికి సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 23: టీడీపీ ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణాల్లో తాము టాప్ ప్లేస్‌లో చిలకలూరిపేట నియోజకవర్గాన్ని నిలిపితే మంత్రి రజిని అన్నివిధాలా అధోగతిపాలు చేశారని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. తమ హయాంలో చిలకలూరిపేటలో యుద్ధ ప్రాతిపదికన 4,512 టిడ్కో ఇళ్ళ నిర్మాణం పూర్తి చేశామని, రాజకీయ పార్టీలకు అతీతంగా దళారుల జోక్యం లేకుండా లాటరీ పద్ధతిలో నిష్పక్షపాతంగా లబ్ధిదారులకు ఇళ్ళను కేటాయించటం జరిగిందన్నారు. టీడీపీ పార్టీ తరుపున సెల్ఫీ ఛాలెంజ్ టూ జగన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాటి శుక్రవారం టిడ్కో ఇళ్ళ సముదాయం వద్దకు వెళ్ళి ప్రభుత్వానికి సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. టిడ్కో ఇళ్ళ సముదాయంలో అన్ని వసతులు ఆనాడే కల్పించామని, కేవలం విద్యుత్ సరఫరా ఒక్కటే ఆనాడు పెండింగ్‌లో ఉందని, అలాంటి పరిస్థితి నుంచి వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు గడుస్తున్నా ఐదు వందల కుటుంబాలు కూడా ఆ ఇళ్ళల్లో చేరలేదని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ళ సముదాయంలో పురుగులు, పాములు, ముళ్ళ పొదలు, అపరిశుభ్రత, అసాంఘిక కార్యక్రమాలకు నిలయమంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి రజినీకి పేదల ఉసురు తగలబెట్టే గుంటూరు పారిపోయారన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన తరువాత పరిశుభ్రంగా 4,512 ఇళ్ళల్లో గృహ ప్రవేశాలు చేయిస్తామన్నారు. పోలీసు ఔట్ పోస్టులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

టీడీపీతోనే స్థానిక సంస్థలకు పునర్జీవం

రాష్ట్రంలో ఐదు సంవత్సరాలుగా మనుగడ కోసం పోరాడుతున్న స్థానిక సంస్థలకు తెలుగుదేశం రాకతోనే పునర్జీవనం అని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నిధులు, విధులు లేకుండా స్థానిక ప్రజా ప్రతినిధులందరినీ రోడ్డుపాలు చేసిన జగన్ సర్కార్ నిర్వాహకాలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు పెద్ద యుద్ధమే చేస్తున్నారని ఆయన అన్నారు. శుక్రవారం చిలకలూరిపేటలో స్థానిక సంస్థలకు సంబంధించి స్థానిక స్వపరిపాలన, ఆత్మగౌరవం, ఆత్మ విశ్వాసం పేరుతో తెలుగుదేశం పార్టీ తరపున ప్రత్యేక డిక్లరేషన్‌ను ప్రత్తిపాటి విడుదల చేశారు. టీడీపీ అధికారంలో ఉన్న సందర్భంలో స్థానిక సంస్థలకు సక్రమంగా నిధులు ఇచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టించామన్నారు. సర్పంచ్‌లకు గౌరవం ఇచ్చామన్నారు. టీడీపీ హయాంలో పంచాయతీలకు ఏడు జాతీయ అవార్డులు వచ్చాయని ప్రత్తిపాటి గుర్తుచేశారు. అలాంటి పరిస్థితి నుంచి జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీరాజ్ వ్యవస్థను ధ్వంసం చేశారని, రూ.10వేల కోట్లకు పైగా వారి నిధులు బలవంతంగా దారి మళ్ళించారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జనసేన నేత తోట రాజారమేష్‌తో పాటు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకులకు సమాజంపై బాధ్యత ఉండాలి

పాలకులు ప్రభుత్వాన్ని నడిపించే వారికి ప్రజలపై కనీస ప్రేమ, గౌరవం, సమాజం పట్ల బాధ్యత ఉండాలని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. క్రైస్తవం కూడా అదే చెప్పిందని, కాని దురదృష్టవశాత్తు క్రైస్తవుడిగా చెప్పుకొనే ముఖ్యమంత్రి జగన్ పాలనలో అవే కరువయ్యాయన్నారు. శుక్రవారం చిలకలూరిపేట గ్రామీణ మండలం రాజాపేటలో తండ్రి సన్నిధి 10వ వార్షికోత్సవ ఉపవాస ప్రార్థనల్లో ప్రత్తిపాటి పాల్గొన్నారు. ప్రార్థనా మందిరం వ్యవస్థాపకులు ప్రముఖ పాస్టర్ షాలెంరాజు ఆధ్వర్యంలో క్రీస్తు ఆరాధన కూటములు జరుగుతున్నాయి.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 23: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన పట్టణంలోని పెదచెరువుకు చెందిన మేడికొండ శివకోటేశ్వరరావు(30) కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఆయన మృతదేహంతో శుక్రవారం రాత్రి పల్నాడు రోడ్డులోని మయూరి లాడ్జ్ సెంటర్‌లో మృతుని బంధువులు ధర్నా చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మేడికొండ శివ కోటేశ్వరరావు రావిపాడు రోడ్డులో కొబ్బరి బోండాల కొట్టు నిర్వహిస్తున్నాడు. గత ఆదివారం కొబ్బరి బోండాల కొట్టు సమీపంలో కాలకృత్యాలకు తీర్చుకునేందుకు రోడ్డు దాటుతున్న సమయంలో ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వెళ్తూ శివకోటేశ్వరరావును ఢీకొట్టాడు. దీంతో శివకోటేశ్వరరావు తలకు తీవ్ర గాయమై బ్రెయిన్‌డెడ్ అయింది. చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిచారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. శివకోటేశ్వరరావుకు భార్య, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం అయిన పిదప శివ కోటేశ్వరరావు మృతదేహాన్ని తీసుకొని అతని బంధువులు తగు న్యాయం చేయాలని పల్నాడు రోడ్డులో ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న సీఐలు కృష్ణారెడ్డి, ఆవుల భాస్కర్, రాఘవేంద్రలు సిబ్బందితో ఘటనా స్థలికి వచ్చి వారితో మాట్లాడి ధర్నాను విరమింపచేశారు. ఈ విషయమై రూరల్ సీఐ రాఘవేంద్రను వివరణ కోరగా యాక్సిడెంట్ కేసులో ఇరువురు యువకుల్లో ఒక యువకుడిని అరెస్టు చేశామని, మరొక యువకుడు గాయపడి చికిత్స పొందుతున్నాడని, వైద్యశాల నుంచి డిశ్చార్జ్ అయిన వెంటనే తగు చర్యలు తీసుకుంటామన్నారు. బాధితుని కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యల కల్యాణం



గంటవారిపాలెంలో కల్యాణ వేడుకలలో పాల్గొన్న దంపతులు

గంటవారిపాలెం (శావల్యాపురం) ఫిబ్రవరి 23: మండలంలోని పోట్లూరు పంచాయతీ పరిధిలోని గంటవారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దనున్న గోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మతల్లి దేవాలయంలో 17వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలలో భక్తులు భారీగా పాల్గొని లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యలకు పాలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యల ఉత్సవ విగ్రహాలకు అంగరంగ వైభవంగా కల్యాణాన్ని జరిపించారు. ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానకార్యక్రమాన్ని నిర్వహించారు.

● పాలపాడు (నరసరావుపేట రూరల్): మండలంలోని పాలపాడులో గోపయ్యస్వామి సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణం శుక్రవారం సాయంత్రం కన్నుల పండుగగా జరిగింది. శుక్రవారం సాయంత్రం దేవస్థానం వద్ద నుంచి గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త యక్కంటి సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు కొలిశెట్టి వెంకటేశ్వర్లు, గాదె పెద్దిరెడ్డి, కుంచాల శివవెంకట్రావు, వై.ధర్మారావు, మెట్టు జగన్నాధరెడ్డి, మోరా సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ పేలి ఒకరికి తీవ్ర గాయాలు

రొంపిచర్ల, ఫిబ్రవరి 23: మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ పేలి గజ్జల లక్ష్మీరెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మీరెడ్డి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. భార్య చనిపోవటంతో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. ఉదయం టీ పెట్టుకుందామని స్టౌవ్ వెలిగించటంతో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. దీంతో సిలిండర్‌కు నిప్పు అంటుకోవటంతో పేలింది. దీంతో 80శాతం మేర గాయాలయ్యాయి. శ్లాబు కూడా దెబ్బతింది. ఇంట్లోని వస్తువులు చెల్లాచెదరుగా పడిపోయాయి. గాయపడిన లక్ష్మీరెడ్డిని అంబులెన్స్‌లో నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అధికశాతం శరీరం కాలిపోవటంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అతన్ని ఎన్‌ఆర్‌ఐ వైద్యశాలకు తరలించనున్నట్టు బంధువులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ పాల్ రాజు రవీంద్ర పరిశీలించారు.

కోటప్పకొండ గిరిప్రదక్షణ సేవాసమితి రిజిస్ట్రేషన్

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 23: ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో అన్నదానం కోసం విరాళం అందించే భక్తుల కోసం సేవాసమితిని రిజిస్ట్రేషన్ చేసి బ్యాంకు ఖాతా ప్రారంభించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతినెల పౌర్ణమి సందర్భంగా భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారు. ఈ నేపథ్యంలో గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు కోటప్పకొండ గిరిప్రదక్షిణ సేవాసమితి ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటుచేస్తారు. ప్రతి సంవత్సరం శివరాత్రి పర్వదినం ముందు వచ్చే ఏకాదశి రోజున, ఆ తర్వాత రోజున భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంటారు. అన్నదానం కోసం విరాళం అందించే భక్తులు 700610031121071, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్‌సీజీ7006 లేదా ఫోన్‌పే నెంబరు 8500713009 నంబరుకు విరాళం అందించాలని కమిటీ సభ్యులు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పథకాల రూపకల్పన

● టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సాంబశివరావు

కనమర్లపూడి (శావల్యాపురం) ఫిబ్రవరి 23: రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు ఉమ్మడి మినీమ్యానిఫెస్టోలోని ఆరు సంక్షేమ పథకాలను రూపొందించారని టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు అన్నారు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని మండలంలోని కనమర్లపూడి గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గోరింట్ల హనుమంతరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పూరేటి నరసింహారావు, తెలుగు యువత మండపాటి రమణ, బోడెపూడి శంకర్, ముక్కపాటి నాగేశ్వరరావు, బోడెపూడి వెంకటేశ్వర్లు, కాసరగడ్డ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 23: పిల్లలను అపహరిస్తున్నారనే అనుమానంతో ఇరువురు గుర్తుతెలియని యువకులపై దాడిచేసిన సంఘటన శుక్రవారం రాత్రి పట్టణంలోని పనస తోటలో చోటు చేసుకుంది. ఓ గ్రానైట్ కంపెనీలో పనిచేసే యువకులు మద్యం సేవించి తిరుగుతుండగా కొందరు పిల్లలు సదరు యువకులు తమను ఎత్తుకు వెళ్ళటానికి ప్రయత్నిస్తున్నారని వారి తల్లిదండ్రులకు చెప్పటంతో వారు వచ్చి ఇరువురు యువకులను తీవ్రంగా కొట్టారు. స్థానికులు ఫొటోలు తీసుకొని వారి వద్ద ఉన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేయగా సదరు యువకులు వెల్లలచెరువులోని ఓ గ్రానైట్ కంపెనీలో పనిచేస్తున్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో స్థానికులు కొందరు విషయం తెలిసి దాడిని ఆపటానికి ప్రయత్నించగా వారిపై కూడా కొందరు దాడిచేశారు. దీంతో స్థానికులు రెండో పట్టణ పోలీసులకు సమాచారం చేరవేశారు. రెండో పట్టణ సీఐ ఆవుల భాస్కర్, మొదటి పట్టణ సీఐ కృష్ణారెడ్డిలు సిబ్బందితో ఘటనా స్థలికి వచ్చి ఆ యువకులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్మీ అధికారులు

ఐటీఐ విద్యార్థులకు అగ్నిపథ్ ఉద్యోగాలపై అవగాహన

వినుకొండ, ఫిబ్రవరి 23: మండలంలోని విఠంరాజుపల్లి సమీపంలోని బాలాజీ ఐటీఐ కాలేజీలో ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు అగ్నిపథ్ స్కీమ్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకటేశ్వరరావుతో పాటు ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు సుబేదార్ మేజర్ అసిస్టెంట్ రిక్రూట్మెంట్ అధికారి రవీంద్రసింగ్‌ఖేత్ మాట్లాడుతూ ఆర్మీనేవీ, ఎయిర్ ఫోర్స్‌లలో త్వరగా ఉద్యోగం ఎలా సంపాదించాలనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

జొన్నలగడ్డ (నరసరావుపేట రూరల్), ఫిబ్రవరి 23: జొన్నలగడ్డ పోలేరమ్మ తల్లి ఆలయ 4వ వార్షికోత్సవ తిరునాళ్ళ శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి అమ్మవారికి విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రుణమాఫీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

మహిళల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం తోడ్పాటు

● ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వేల్పూరు (శావల్యాపురం) ఫిబ్రవరి 23: సీఎం జగన్మోహన్‌రెడ్డి మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అమలుచేసి ఆర్థిక అభ్యున్నతికి ఎంతగానో తోడ్పాటునందించాడని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని వేల్పూరులో వైఎస్సార్ ఆసరా 4వ విడత రుణమాఫీ సంబరాలను శుక్రవారం నిర్వహించారు. మండలంలోని 706 డ్వాక్రా సంఘాలలోని 6892మంది మహిళలకు రూ.5.51కోట్ల రుణమాఫీ చెక్కును ఎమ్మెల్యే డ్వాక్రా మహిళలకు అందజేశారు. అనంతరం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని 11సచివాలయాల పరిధిలో సేవాపురస్కారాలకు ఎంపికైన 202మంది వలంటీర్లను సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, సొసైటీ చైర్మన్‌లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా సాంబశివరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు నారాయణమ్మ, ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి, ఈవోపీఆర్డీ సుగుణ, స్త్రీనిధి ఏజీఎం చిన్నబుల్లెయ్య, ఏపీఎం వాసుబాబు, గ్రామ నాయకులు తూమాటి కబ్బారావు, స్వర్ణాల వెంకట్రావు, రాఘవరావు పాల్గొన్నారు.

అదుపుతప్పిన ప్రైవేటు స్కూల్ బస్సు: తప్పిన ప్రమాదం

ఈపూరు, ఫిబ్రవరి 23: మండలంలోని కొండ్రముట్ల వద్ద ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. ప్రమాదంలో బస్సులో ఉన్న పిల్లలు ఎవరికీ ఏమీ కాలేదు. వినుకొండలోని గుడ్ షెపర్డ్ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు బొల్లాపల్లి మండలంలోని గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకువెళ్తుండగా శుక్రవారం సాయంత్రం ప్రమాదం చోటు చేసుకుంది. బస్సు అతివేగంగా నడపడం వల్లనే అదుపుతప్పిందని అక్కడ ఉన్నవారు ఆరోపించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 35మంది విద్యార్థులు ఉన్నట్లు చెబుతున్నారు.

నేడు కొండ గురునాథ స్వామి తిరునాళ్ళ

నూజెండ్ల, ఫిబ్రవరి 23: మండలంలోని రవ్వవరం కొండగురునాథ స్వామి తిరునాళ్ళ శనివారం వైభవంగా జరగనుంది. తిరునాళ్ళను పురస్కరించుకొని శుక్రవారం భక్తులు ఉదయం నుంచి మెట్ల పూజలో విశేషంగా పాల్గొన్నారు. గ్రామం నుంచి కొండమీదకు నాగాభరణాలను మేళతాళాలతో తరలించారు. తిరునాళ్ళను పురస్కరించుకొని పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి ఆరు భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయనున్నారు. నరసరావుపేట డీఎస్పీ వర్మ తిరునాళ్ళ జరగనున్న ప్రదేశాన్ని పరిశీలించి తిరునాళ్ళ ఏర్పాట్లపై ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డికి సూచనలు చేశారు.



న్యాయవాదులకు సంఘీభావం తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

టైటిలింగ్ యాక్ట్‌ను ప్రభుత్వం రద్దుచేయాలి

వినుకొండ, ఫిబ్రవరి 23: ప్రజల ఆస్తులకు భద్రత లేని టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం కోర్టు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. టీడీపీ, జనసేన, సీపీఐ, కాంగ్రెస్, సీపీఎం పార్టీలతో పాటు ప్రజా సంఘాల న్యాయవాదులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని మాట్లాడుతూ అధికార ముసుగులో రాజకీయ జోక్యాన్ని ప్రారంభించే ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం 2022ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా కొనసాగించని టైటిలింగ్ యాక్ట్‌ను ఏపీ ప్రభుత్వం అమలు చేయడం దుర్మార్గమన్నారు. న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసేలా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందన్నారు. టైటిలింగ్ చట్టం ద్వారా నష్టపోయిన బాధితులకు న్యాయం చేయకుండా బాధితులపైనే కేసులు పెట్టి జైల్లో వేస్తున్న పరిస్థితి చట్టం కల్పిస్తుందన్నారు. ఐలు నాయకులు సీహెచ్‌ఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసేవిధంగా ఉందన్నారు. కార్యక్రమంలో బార్ ఫెడరేషన్ ఉద్యమ కన్వీనింగ్ కమిటీ న్యాయవాదులు ఎస్.బ్రహ్మానందరెడ్డి, రాజారావు, నీలం రామ్మోహన్, చిగురుపాటి రవీంద్ర, కాళిదాసు, చంద్రా ఆంజనేయులు, అనిల్, సీతారామాంజనేయులు, జనసేన పార్టీ నాయకుడు నిశ్శంకర శ్రీనివాసరావు, సీపీఎం హనుమంతరెడ్డి, సీపీఐ మారుతివరప్రసాదరావు, కాంగ్రెస్ ఆర్కేనాయుడు, న్యాయవాదుల సంఘం నాయకులు సైదారావు, రామకోటేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగరాజు, రమణారెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



చెంఘీజ్‌ఖాన్‌పేటలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న ఆకుకూరలను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి

ప్రకృతి వ్యవసాయ విధాన ఉత్పత్తులు ఆరోగ్యకరం

● డీపీఎం అమలకుమారి

చెంఘీజ్‌ఖాన్‌పేట (యడ్లపాడు), ఫిబ్రవరి 23: ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన పంటలు లేదా ఉత్పత్తులు ఆరోగ్యకరమైనవని ప్రకృతి వ్యవసాయం డీపీఎం అమలకుమారి అన్నారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో ఆమె శుక్రవారం పర్యటించారు. ముందుగా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న ఆకు కూరలను ఆమె పరిశీలించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంకు చేరుకుని ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. నమూనాల ద్వారా ఇళ్ళ వద్దనే ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను తీసుకోవచ్చన్నారు. వీలుకాని వారి కోసం ప్రతి సోమవారం స్టాల్స్ ఏర్పాటుచేసి ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంట ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. నేరుగా రైతుల నుంచే ఈ ఉత్పత్తులను వినియోగదారులు కొనుగోలు చేసుకునేలా వీలు కల్పించామన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానం గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిల్లా, మండల సమాఖ్యల ద్వారా కృషిచేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, ఫిబ్రవరి 23: పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. టౌన్ పరిధిలోని చౌత్రసెంటర్, మద్ది మల్లయ్య వీధి, రాచుమల్లువారి వీధి ప్రాంతాల్లో మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

లింగారావుపాలెం (యడ్లపాడు), ఫిబ్రవరి 23: మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పది చదువుతున్న విద్యార్థులకు డీఎస్ఆర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన డీఎస్ఆర్ అసోసియేషన్ సభ్యుడు దామచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవితంలో రాణించాలంటే ఉన్నత విద్యతోనే సాధ్యమన్నారు. అనంతరం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 56మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్ను, పెన్సిల్, స్కేల్‌ను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యుడు రావూరి నాగేశ్వరరావు, జంపాల శివబాబు, హెచ్‌ఎం రామిరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ షేక్ మీరావలి, గ్రామ పెద్దలు నంబూరు శివరామకృష్ణ, తోకల సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

వినుకొండ, ఫిబ్రవరి 23: పట్టణంలోని 30వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు మున్సిపల్ అధికారులతో పాటు మున్సిపల్ చైరపర్సన్ డాక్టర్ దస్తగిరి సతీమణి, 30వ వార్డు కౌన్సిలర్ షేక్ షకీలా శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థికసంఘం నిధులతో రూ.15లక్షల నిధులు 140మీటర్ల సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు. అవసరమైన చోట తక్షణమే యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేస్తున్నట్లు డీఈఈ వెంకయ్య తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల ఓటరు వివరాల సేకరణపై పలు అనుమానాలు

నూజెండ్ల, ఫిబ్రవరి 23: మండలంలోని ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల ఓటర్ల వివరాలను ఉన్నతాధికారులు సేకరించటంపై మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ పార్టీ నాయకులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఉద్యోగుల ఓటరు వివరాలను సేకరించటంపై అభ్యంతరం ఉన్న వారు వివరాలు ఇవ్వకపోవటంతో ఉన్నతాధికారులు కచ్చితంగా ఇవ్వాలని ఆదేశించటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇష్టంలేకున్నా వివరాలు ఇవ్వాల్సి వస్తుందని ప్రభుత్వ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ విషయంపై ప్రతిపక్ష రాజకీయపార్టీల నాయకులు జిల్లా అధికారుల దృష్టికి, పార్టీ నాయకుల దృష్టికి తీసుకు వెళ్ళేందుకు ప్రయత్నిస్తున్నారు.

విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ అందజేత

నూజెండ్ల, ఫిబ్రవరి 23: స్థానిక జడ్పీ పాఠశాలలో శుక్రవారం జేఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షా మెటీరియల్‌ను వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ దూలం మునిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయులు పీ నారాయణరావు, కొమ్మా చంద్రశేఖర్, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వీవీ శ్రీనివాసరావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా మల్లికార్జునరావు

నూజెండ్ల, ఫిబ్రవరి 23: నూజెండ్ల ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ ఏఈగా ఈపూరు మండలంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న యూ మల్లికార్జునరావుకు అదనపు బాధ్యతలు ఉన్నతాధికారులు ఇవ్వటంతో శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పీ వీరభద్రాచారిని కలసి ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించారు.

వడ్డెంగుంటలో జగనన్న సురక్ష

బొల్లాపల్లి, ఫిబ్రవరి 23: మండలంలోని వడ్డెంగుంటలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీవో విజయకుమార్ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్యాధికారులు డాక్టర్ కృష్ణానాయక్ మాట్లాడుతూ సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సాయితేజ, నిమ్స్ డాక్టర్ లక్ష్మణరావు, పంచాయతీ సెక్రటరీ పాండురంగారావు, గాలం గోవిందరాజులు, ఎలిశెట్టి రంగయ్య, ఆదం, ముంద్రు వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆషా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.